# మరనాథ మెసేంజర్

క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక

# MARANATHA MESSENGER



**నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును; ...**




సంపుటి 37 | జూన్ 2019 | సంచిక 6

# లూకా సువార్త
## (37 వ భాగము)

శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ

## యేసు మా ఊరొస్తే...అమ్మో! : (లూకా సువార్త 8 : 34-39)

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ ఇంటిల్లపాదికి శుభాశీస్సులు !

**"అప్పుడు దయ్యములు ఆ మనుష్యుని విడిచిపోయి పందులలో చొచ్చెను గనుక, ఆ మంద ప్రపాతమునుండి సరస్సులోనికి వడిగా పరుగెత్తి ఊపిరి తిరుగక చచ్చెను. మేపుచున్నవారు జరిగినదానిని చూచి, పారిపోయి ఆ పట్టణములోను గ్రామములోను ఆ సంగతి తెలియజేసిరి. జనులు జరిగినదానిని చూడవెళ్లి యేసునొద్దకువచ్చి, దయ్యములు వదలిపోయిన మనుష్యుడు బట్టలు కట్టుకొని, స్వస్థచిత్తుడై యేసు పాదములయొద్ద కూర్చుండుట చూచి భయపడిరి. అది చూచినవారు దయ్యములు పట్టినవాడేలాగు స్వస్థతపొందెనో జనులకు తెలియజేయగా గెరసేనీయుల ప్రాంతములలోనుండు జనులందరు బహు భయాక్రాంతులైరి గనుక తమ్మును విడిచిపొమ్మని ఆయనను వేడుకొనిరి. ఆయన దోనెయెక్కి తిరిగి వెళ్లుచుండగా, దయ్యములు వదలిపోయిన మనుష్యుడు, ఆయనతోకూడ తన్ను ఉండనిమ్మని ఆయనను వేడుకొనెను.**

**అయితే ఆయన- నీవు నీ యింటికి తిరిగివెళ్లి, దేవుడు నీకెట్టి గొప్పకార్యములు చేసెనో తెలియజేయుమని వానితో చెప్పి వానిని పంపివేసెను; వాడు వెళ్లి యేసు తనకెట్టి గొప్పకార్యములు చేసెనో ఆ పట్టణమందంతయు ప్రకటించెను".**

గత మాసంలో గెరసేనీయుల దేశములో సేన దయ్యములు పట్టిన వ్యక్తిని ప్రభువైన యేసు స్వస్థపరచిన సందర్భాన్ని నేర్చుకొన్నాము. ఆ స్వస్థతకార్యం గురించి ఊళ్లోవారందరికి తెలిసింది. ఎలాగంటే, మన ఊరిలో దురాత్మలుపట్టి దిగంబరిగాఉంటూ బహుకాలముగా సమాధులలో నివాసము చేస్తున్న వ్యక్తిని నజరేతువాడైన యేసుప్రభువు బాగుచేసాడు. అతడు ఇప్పుడు బాగుపడి బుద్ధిమంతుడై యేసుస్వామి ప్రక్కన కూర్చున్నాడనే కబురు మందలను మేపుచున్నవారు చూచి, ఆ పట్టణములోను, గ్రామములలోను ఆ వార్తను తెలియజేసారు. జనులందరు జరిగినదానిని చూడవెళ్లి వాడేలాగు స్వస్థతపొందెనో తెలుసుకొని వారందరు బహు భయాక్రాంతులైరి. కాబట్టి వారు- తమను విడిచిపొమ్మని యేసుప్రభువును వేడుకొనిరి. ఆ పట్టణ ప్రజలందరు తమను విడిచిపొమ్మని ప్రభువుతో చెప్పడానికి కారణమేమిటంటే - అయ్యా, మీరు మాఊరొచ్చి గొప్పపని చేసారు. అయితే, ఆ పందులమందలన్నీ చచ్చిన కారణాన ఇప్పుడు వారి జీవనాధారం పోయింది. నీకో దణ్ణం నాయన, నువ్వు మా ఊరొదిలి వెళ్లిపో అని వేడుకొన్నారు. అంటే, ఆ ఊరివాళ్లకి

మనుష్యులు బ్రతకడం కంటె జంతువులు బ్రతకడం ప్రాముఖ్యముగా కనబడుతుంది.

జంతు ప్రేమికులను గురించి మనం వింటూఉంటాం. జంతుప్రాణంకూడ విలువైనది, దానిని హీనంగా ఎంచడానికి లేదు. ఆ మాటకొస్తే మనంతినే కూరగాయల ప్రాణంకూడ విలువైనదే, అయినా తినేస్తున్నాం. బెంగాలి సైంటిస్ట్ ఒకాయన కూరగాయలను ఆకులను తుంచినప్పుడు, చెట్లు నరికేటప్పుడు కారే రసంలాంటిది అవి కార్చే కన్నీటితో పోల్చి ఆ సిద్ధాంతాన్ని రుజువుచేసాడు. కనుక ఏదోఒక ప్రాణాన్ని ఏడిపించి, చంపి మనం తింటున్నాం బ్రతుకుతున్నాం. ఆటకొరకు, వేటకొరకు నిర్దాక్షిణ్యంగా ఒక జంతువును చంపడాన్ని నేనుకూడ ఇష్టపడను. కూరగాయలు, పళ్లు కోసుకొని మనమెలా ఆహారంగా తీసుకొంటున్నామో అలాగే జంతుమాంసాన్ని ఆహారంగా చేసుకోవడము ఆక్షేపణ కాదుగాని కేవలం వినోదంకోసం ఆటకోసం జంతువులను వేటాడి చంపడము, వాటి ప్రాణాన్ని హింసించి వదిలేయడము సరికాదు.

గెరసీనీయుల ప్రాంతప్రజలు వచ్చి యేసు దేవుడు వాళ్ల ఊరువిడిచి వెళ్లిపొమ్మని అభ్యర్థించారు. ప్రభువు, వద్దన్నవాళ్ల దగ్గరికి వెళ్లడుకదా, కావాలనుకొన్న వాళ్ల దగ్గరికే వెళతాడు. నమ్ముకొన్నవాళ్లకి, ఆశ్రయం కోరినవాళ్లకే ఆశ్రయమిస్తాడు. ఆయన చరణాలదగ్గర శరణుజొచ్చినవారికే ఆదరణను, ధైర్యము, ప్రోత్సాహమిస్తాడు. దీవించి ఆదుకొంటాడు. ఇంతకీ ఆ ఊరివాళ్లలోఉన్న తప్పేమిటంటే- అయ్యా, నువ్వువచ్చి మా రొటీన్‌లైఫ్‌ని ఆటంకపరుస్తున్నావు. నీవల్ల రెండువేల పందులు చచ్చిపోయాయి అనే భావనతో ఉన్నారు. రెండువేలు పందులు చచ్చి ఒకడు బ్రతకడం కంటె, రెండువేలు పందులు బ్రతికి ఒకడు చస్తే మంచిదనే భావనవారిది. జంతువులకంటె మనుష్యులను హీనంగా చూచి, మనుష్యులకంటె జంతువులను ఎక్కువగా ప్రేమించేవారు అనేకమంది ఉన్నారు. తిండిలేక తిప్పలుపడుతున్న పేద ప్రజానీకానికి చేయూత నివ్వని ఎంతోమంది ధనికులు ఇంట్లో పెంచుకున్న కుక్కలకి, పిల్లులకి వారి కోట్లాది ఆస్తులు వీలునామా రాసి చచ్చిపోవడం చూస్తే ఆందోళన కలిగిస్తుంది. పిచ్చిపట్టి దురాత్మలు పీడిస్తూ సమాధులలో నివాసం చేసేవాడు బాగుపడితే ఆ ఊరివాళ్లకు అసంతృప్తి కలుగుతూఉంది. మా రొటీన్ లైఫ్‌ని డిస్టర్బ్ చేస్తున్నావు యేసయ్యా నువ్వు అన్నట్లు మాట్లాడుతున్నారు.

నా చిన్నతనంలో మా అమ్మగారు ప్రభువును నమ్ముకొనిఉన్నందున కేరళభక్తులు మాఇంటికి వచ్చేవారు. వారు నాతో బాబూ, ప్రార్థనచేసుకో, యేసుప్రభువును నమ్ముకో అని చెప్పేవారు. వద్దులెండి బాబూ, అనుకొనేవాణ్ణి. నా ఉద్దేశ్యమేమిటంటే, యేసుప్రభువును నమ్ముకొంటే అనుదిన జీవితములో నేను అలవాటుపడిన అలవాట్లు ఉన్నాయే, వాటిని అదుపుచేసుకోవడం మనకి చాలా కష్టం అనిపించింది. కుర్రకారుమి, నల్లరాతిని తంతే నాలుగుముక్కలయ్యే యవ్వనకాలంలో ఉన్న మమ్ములని కాలు, చెయ్యి, నోరు, కళ్లు కట్టేసుకొని ఉండమంటారు మీ దేవుడికి మీ భక్తికి ఒక దండం.

మాకు అక్కర్లేదండీ అని నిష్కర్షగా చెప్పేవాణ్ణి. యేసు దేవుని నమ్ముకొంటే బ్రతుకు మారుస్తాడు. బ్రతుకులోఉన్న పాడు అలవాట్లు మానుకోమంటే కష్టం కదా యవ్వనస్తులుకి. ఆ దుర్వ్యసనాలు మానుకో, పొగత్రాగడము, మత్తుపానియాలు సేవించడం మానుకోవాలి అని చెబితే- కాఫీ, టీ, మత్తుపానియములు సేవించరాదు అని చిన్నప్పుడు బళ్లో మాష్టారు చెప్పారు. మరిమీరు గ్లాసులకు గ్లాసులు కాఫీ, టీ లు త్రాగితే తప్పులేదుగాని మేము మందు తాగితే తప్పేమిటి అని వాదించేవాడిని. ఈ తిక్కవితర్కానికి వాళ్లు తట్టుకోలేక నాతో - ఏదోఒక రోజున యేసుప్రభువు నిన్ను పట్టుకొంటాడు బాబూ. ఆరోజు ఈ తిక్కప్రశ్నలు అడిగేవాళ్లు నీకు ఎదురవుతారు, అప్పుడు నువ్వు దేవునిపక్షముగా జవాబు చెబుతావు అనేవారు. ఆరోజు చచ్చినా రాదులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడిని.

అమ్మలారా, అయ్యలారా, దేవుడు విలువైన బహుమానంగా ప్రసాదించిన యవ్వనస్తులైన మీ పిల్లలు దురభ్యాసాలలో వ్యసనాలలో చిక్కుబడి, జీవితాలు వృధా చేసుకోకుండా వారిని కాపాడవలసిన బాధ్యత మనకుఉంది. తల్లిదండ్రులు కష్టపడి పిత్రార్జితంగా ఇచ్చిన ఆస్తులను మైనంవలె కరిగిన్తూ వ్యసనబానిసలైన వారిని ఎంతోమందిని చూస్తున్నాం. మీరు యేసుప్రభువును నమ్ముకొంటే మీ సంతానాన్ని దేవుడు మారుస్తాడు. మేము నమ్ముకుంటే దేవుడు మా పిల్లలను ఎలా బాగుచేస్తాడని అనుకొంటున్నారా!

వెనుకటికి ఒకపెద్ద జమిందారీకుటుంబము సిరిసంపదలుతో తులతూగుతున్నారు. హఠాత్తుగా ఇంటియజమాని చనిపోయాడు. యవ్వనస్తులైన పిల్లలు పేకాటలు, పందాలు, జూదాలకు అలవాటుపడగా, ఆస్తులన్నీ కరిగిపోతున్నాయి. ఆ తల్లిగారు నిష్టతో వ్రతాలు, నోములు ఎన్నో చేసింది. కుమారులలో మార్పురాలేదు. చివరికి ఎవరో చెప్పారు- యేసుప్రభువును నమ్ముకోమ్మా, నీ కొడుకులు మారతారు అని. ఇన్ని చేసాను, మార్పులేదు ఇప్పుడు యేసుదేవుడిని నమ్ముకొంటే మారతారా, పొండి అంటూ విదిలించింది. అయినవాళ్లు ఎవరో- ఒక్కసారి వెళ్లిచూడు, ప్రభువుమాటలు విను అని నచ్చజెప్పి ఒక ప్రార్థనామందిరానికి తీసుకువెళ్లారు. దేవునిసన్నిధిలో ఆమెమనసుకు హాయిగ అనిపించింది, దేవునిమాటలు మళ్లీమళ్లీ వినాలనిపించింది, విన్నమాటలు జ్ఞాపకానికి వస్తున్నాయి. దేవుడు ఆ తల్లిగారిని దర్శించాడు. తన కుమారులు బాగు పడతారన్న నిర్ధారణ దేవుడు ఆ తల్లికి దర్శనంద్వారా తెలియపరచాడు. తరువాత ఆమె- తనకొడుకులు మనస్సు మారి, ఆస్తులు మిగిలియుండి వారి పిల్లలు సుఖప్రదమైన జీవనంచెయ్యాలి యేసుప్రభువా, అందుకు నీవు కృపచూపించుమని ఉపవాసాలుండి కన్నీటితో ప్రార్థించేది. కాలగమనాన ఆమె కొడుకుల్లో మార్పుతెచ్చాడు దేవుడు! ఆమె నన్ను కలుసుకొన్నప్పుడు నాతో - నిన్ను కన్నతల్లి భాగ్యవంతురాలు బాబూ, ఆమె నీ కొరకు ఎంత కన్నీటితో ప్రార్థించిందో తత్ఫలితంగా నువ్వు మారావు, అనేకమంది జీవితాల్లో మార్పుకొరకు దేవుడు నిన్ను వాడుకొంటున్నాడు

అంటూ చాలా సంతోషంగా చెప్పేది.

సోదర సోదరీలారా, మీ ఇంటివారు ఎవరైన గాడితప్పితే ఆ జీవితాలను రక్షించే యేసు దేవునిని మీ మనసులోనికి చేర్చుకోండి. క్రైస్తవ మతం తీసుకోవద్దు. మతం అంటే ఆచార వ్యవహార కర్మకాండల వ్యవస్థ. ఆ వ్యవస్థలోకి వెళ్లవద్దు. ఎందుకంటె యేసుక్రీస్తు క్రైస్తవమతంలో లేడు, యేసుక్రీస్తు క్రైస్తవమత స్థాపకుడు కాదు. ప్రభువైన యేసులో జీవం ఉంది, అద్భుతమైన శక్తి మహాత్యాలున్నాయి. ఆయన మీ జీవితాల్లో మార్పును, మీ సంతానములో, మీ కుటుంబ పరిస్థితుల్లో మార్పు తేగలిగిన శక్తిమంతుడు.

కొంతమంది ఉద్యోగస్తులు ప్రభువు నిజదేవుడని తెలిసినా నమ్మకోరు. ఎందుకంటె అక్కడున్న లంచాలవ్యవస్థ నుంచి బయటకు రావలసి వస్తుందని భయం. కొంతమంది వ్యాపారస్తులు వారు చేసే అక్రమ మోసపూరిత వ్యాపారం మానుకొంటే లాభాలు పోతాయని యేసును నమ్మకోరు. చాలామంది తమ జీవనశైలిని మార్చుకోవడానికి ఇష్టం లేక ప్రభువు నిజదేవుడని తెలిసినప్పటికిని నమ్ముకోవాలంటే వెనుకాడతారు. మీ జీవనశైలిని మార్చుకోవాలనుకొంటే మీ దగ్గరున్న మంచి అలవాట్లను మార్చుకోనక్కరలేదు. చెడు అలవాట్లనే మార్చుకోవాలి. ఈ దేవుడు మీ లోనికి వచ్చి మీ జీవితాల్లో ఉండకూడని అవలక్షణాలను పారద్రోలి, మీ జీవితాన్ని శుద్ధిచేసి మోక్షప్రాప్తం సంప్రాప్తం చెయ్యాలని ఆశిస్తున్నాడు.

శాశ్వత విలువ కలిగిన అమర్త్యమైన ఆత్మ కలిగిన మనుష్యుని జీవితం జంతువులకంటె ఎంతో ప్రాముఖ్యంకదా! చెడిపోయి, దుర్వ్యసనాలకు లోనై ఒక మనిషి, ఒక కుటుంబం నశించిపోతుంటే వాళ్లని బాగుచేసే ఈ దేవునిని నమ్ముకోవడం ఎంతో మేలుకదా! నేను ప్రభువును నమ్ముకొంటే మాఊళ్లోవాళ్లు- ఇంత బ్రతుకు బ్రతికి ఆ మతంలోకి వెళ్లావేంట్రా అనేవారు. ఎన్ని తప్పుడు పనులు చేసినా అభ్యంతరపడరు కాని ఒకవ్యక్తి ప్రభువును నమ్ముకొని బాగుపడటము కంటె వ్యసనాలపాలైన పరవాలేదు అనే వారిని చూస్తే ఆశ్చర్యంవేస్తుంది. క్రైస్తవ్యం పట్ల, మనుష్యునిలో మారుమనస్సు కలిగించే ఈ మహాదేవునిపట్ల అనేకులలో ఎంత ద్వేషభావం పాదుకుందో అనిపిస్తుంది. కొంతమంది సహృదయులు- వాడు నమ్ముకొంటే నమ్ముకొన్నాడు గాని మనిషిగా మారాడు, అది కదా అసలు లెక్క! అని చెప్పుకొనే వారున్నారు. వాళ్లు ప్రభువును నమ్ముకోకపోయినా, అతడు నమ్ముకొన్న దేవుడు అతని జీవితాన్ని మార్చాడంటూ అభినందిస్తారు. అట్టివారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

ఈ భాగములో ఆరువేల దయ్యాల బారినుండి, వాటి బంధకాలనుంచి విడుదలపొందిన వ్యక్తి బుద్ధిమంతుడై సాధువులాగ యేసు పాదాలదగ్గర కూర్చొని అడుగుతున్నాడు- ఈ సంభాషణను మనభాషలో చెబుతున్నాను. ఆ వ్యక్తి: నేనుకూడ నీతో వచ్చేస్తాను యేసయ్యా అంటే యేయస్య అతనితో- పిచ్చోడ, నాతోఎందుకొస్తావు?

మీ ఊరు ఎలాగూ నన్ను రావొద్దన్నారు కదా. నేనొస్తే వారి జీవితాల్లో మార్పు వస్తుందని, జీవనశైలి మారుతుందని వాళ్ల భయం. మతం మారుతుందని కాదు, వాళ్ల దురలవాట్లు, దుర్వ్యసనాల నుండి విడుదలపొంది వారి బ్రతుకులు మారతాయనే భయంచేత నన్ను వద్దన్నారు. అందుచేత నేను నీకిచ్చిన విడుదల కార్యాన్ని గూర్చి మీ ఊరివాళ్లకు నువ్వు వెళ్లి చెప్పు. మీ గ్రామంలో, పట్టణములో నాకు సాక్షిగా ఉండుమని చెప్పాడు.

చాలామందికి దేవుని మందిరములోనే ఉండిపోవాలనిపిస్తుంది. అట్టికోరిక మంచిదేకాని దానికంటె గొప్పకోర్కె ఏమిటంటే- నీ ఇంటివారికి, కులస్తులకు, గోత్రికులకు, గ్రామస్తులకు, స్నేహితులకు నిన్ను మార్చిన యేసుదేవునిగూర్చి సాక్ష్యంచెప్పేవారిగ ఉండాలి. ఆ సాక్ష్యం ద్వారా అనేకులలో మార్పురావాలి. దేవునికి మహిమ తేవాలి. ఊరూర, ప్రయాణాల్లో నన్ను కలుసుకొన్నవారికి నన్ను మార్చిన యేసుదేవుని గూర్చి చెప్పకుండా ఉండను. నేను మతానికి ప్రతినిధిని కాను. మతాతీతుడు, మహిమాన్వితుడైన యేసుదేవుడు నాజీవితంలోకొచ్చి సమూలమైన మార్పు తెచ్చాడు. వ్యసనాల బానిసత్వం నుంచి విడిపించాడు. ఈ దేవుడు నిజదేవుడని సజీవుడని నేను నమ్మడమేకాకుండ, అనుభవించి చెబుతున్నాను. దేవునిచే మేలు పొందిన దేవుని ప్రజలారా, ఆ మేలులను గూర్చి మీ గ్రామస్తులు, బంధువులు, మిత్రుల మధ్యలో ప్రభువును మహిమపరుస్తూ సాక్ష్యం చెప్పండి. దేవుడు మిమ్ములను మీ కుటుంబాలను బహుగా ఆశీర్వదించి వర్ధిల్లచేయును గాక.

**- మరనాత.**

# గమనించండి - సహకరించండి

**మీరు "మరనాత మెసేంజర్" పట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞులము. ముద్రణావ్యయము పెరిగిన కారణముగా జనవరి 2018 నుండి పత్రిక సాలుసరి చందా రూ.150/-కు పెంచడమైనది. గాన పాఠకులు గమనించి సహకరించగలరు. మీరు సాలుసరి చందా చెల్లించారా? లేనియెడల త్వరగా చెల్లించి పత్రికా పరిచర్యలో మీవంతు సహకారమును అందించండి, ప్రార్థించండి. మీ చందా పంపునప్పుడు యం.ఓ ఫారంలో సమాచారము కొరకు ఇవ్వబడిన స్థలములో మీ పేరు, పూర్తి అడ్రస్సు (ఇంటి నెంబరు, వీధిపేరు తప్పక రాయాలి మరియు మీ అడ్రస్సు మారినచో పాత, క్రొత్త అడ్రస్సులు పిన్ కోడ్ నంబరుతో సహా) వ్రాసి మీకు రసీట్టులు, పత్రికలు పంపడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి మాతో సహకరించ వలసినదిగా పాఠకులకు మనవి.** **- ఎడిటర్స్.**

# అభ్యర్థన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., Ph.D.
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్: 9849746464

## హిజ్కియా - భక్తి జీవితము-1

**(2 రాజులు 18-20; 2 దినవృత్తాంతములు 29-32; యెషయా 36-39 అధ్యాయములు)**

పాఠక మిత్రులకు శుభములు.

దేవుని యందలి భక్తిని భక్తిసూత్రాలతో, దేవునికిష్టమైన పద్ధతిలో జరిగించటం దైవికం. అలాకాకుండా మనకు తోచినట్లుగా, దేవుని గూర్చిన అవగాహనను మలచుకొని దేవుని సేవించటం అనైతికం. బైబిలు గ్రంథములో అనేకమంది భక్తులు దేవుని సూచనలను అనుసరించి, ప్రతికూలతలోనూ, అనుకూలతలోనూ జీవించి దైవానుగ్రహం పొందారు. ఈ సందర్భములో మనము పరిశీలించబోయే రాజు ఆరంభములో దేవుని సేవించిన విధమును పరిశీలించి అందున్న భావనలను గ్రహిద్దాం.

హిజ్కియా, ఆహాజు కుమారుడు. యూదా దేశమును ఏలిన 13వ రాజు. ఇతని వయస్సు ఇరువదియయిదేండ్లప్పుడు రాజుగా అభిషేకింపబడి యూదా దేశమును 29 సంవత్సరములు పాలించాడు (715-686 బి.సి) (2 రాజులు 18 : 1). హిజ్కియా తండ్రియైన ఆహాజు దేవుని అనుసరించినవాడు కాదు. అతని పాలనలో 'దేవుని మందిర తలుపులు మూయబడెను' (2 దినవృ॥ 28 : 24,25). అయితే హిజ్కియా - "అతడు తన యేలుబడి యందు మొదటి సంవత్సరము మొదటి నెల మందిర తలుపులు తెరచి వాటిని బాగుచేసెను" (2 దినవృ॥ 29 : 3). మన పితరులు ద్రోహులై మన దేవుడైన యెహోవా దృష్టికి చెడునడతలు నడిచి ఆయనను విసర్జించి, ఆయన నివాసమునకు పెడముఖము పెట్టుకొని దానిని అలక్ష్యము చేసిరి. మరియు వారు మంటపము యొక్క ద్వారములను మూసివేసి, దీపములను ఆర్పివేసి, పరిశుద్ధ స్థలమందు ఇశ్రాయేలు దేవునికి ధూపము వేయకయు, దహన బలులు అర్పింపకయుండిరి (2 దినవృ॥ 29 : 6-7).

హిజ్కియా, తన తండ్రి నడచిన మార్గమున నడువక దేవుని యందలి భయభక్తులు గలవాడై తిరిగి దేవుని మందిరములో జరుగవలసిన కార్యములను పునరుద్ధరించాడు. ఇది సంతోషింపదగిన పరిణామం. పెద్దలను, తండ్రులను గౌరవించటం, వారి బాటలో

నడువటం మంచిదే గాని, వారు దైవవిరుద్ధంగా వ్యవహరించినట్లయితే విభేదించటమే విదాయకం. వారు తల్లిదండ్రుల స్థానములో ఉన్నప్పటికి దైవవిరుద్ధ కార్యక్రమాలు జరిగించినప్పుడు, ఆ విషయంలో వారి సంతానం హిజ్కియా వలే విభేదించి, దేవుని చిత్తమును నెరవేర్చాలి. అంతేగాని, వారనుసరించిన అక్రమపద్ధతులను ఆమోదించటం వారిని గౌరవించటం కాదు. ఇలాంటి విషయములలో వారెవరైనప్పటికి విభేదించటమే ఆధ్యాత్మికం.

హిజ్కియా రాజ్యాధికారం చేపట్టిన వెంటనే 'ఉన్నత స్థలములను కొట్టివేసి... వచ్చియుండిరి' (2 రాజులు 18 : 4). అనగా దైవవిరుద్ధమైనవాటిని పూర్తిగా తొలగించి దైవారాధనను పునరుద్ధరించాడు. "వారికీలాగు ఆజ్ఞయిచ్చెను - లేవీయులారా, నామాట ఆలకించుడి - ఇప్పుడు మిమ్మును మీరు ప్రతిష్ఠించుకొని, మీ పితరుల దేవుడైన యెహోవా మందిరమును ప్రతిష్టించి పరిశుద్ధ స్థలములోనుండి నిషిద్ధవస్తువులన్నిటిని బయటకు కొనిపోవుడి (2 దినవృ॥ 29 : 5). ఈవిధముగా ఆనాటి దేవుని మందిరము పునరుద్ధరించ బడింది. ఇది నిజంగా ఆశ్చర్యం. తండ్రి చేసిన తప్పిదమును కొనసాగించక, భావపరిపక్వతతో దైవారాధనలను హిజ్కియా క్రమపరచటం ఆహ్వానించదగిన పరిణామం. ముందుతరాల వారు తెలిసి తెలియక చేసిన తప్పులను వారి సంతానం వివేకంతో సవరించాలి. అంతేగాని దైవవిరుద్ధ కార్యకలాపాలను వారసత్వంగా కొనసాగించరాదు. తల్లిదండ్రులను గౌరవించట మంటే వారు చేసిన తప్పులను అనుసరించటం కాదు. ఒకవేళ అలాంటివి జరిగితే వారి సంతానం వాటిని సవరించాలి. మంచివాటిని కొనసాగించాలి.

భౌతిక దైవమందిరాలలో ఆత్మతో, సత్యముతో కూడిన ఆరాధనలు పునరుద్ధరించటం ఎంత ప్రాముఖ్యమో, అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యంగా మన మది మందిరాలను పరిశీలించి పునరుద్ధరించుకోవటం అంతే ప్రాముఖ్యం. 'మీ దేహం దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో ఉన్న పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నదని మీరెరుగరా? (1 కొరింథి 6 : 19). ఈరోజుల్లో చాలామంది, భౌతిక మందిరాల సుందరీకరణపై శ్రద్ధను అధికంగా చూపిస్తున్నారు. అది మంచిదేగాని, అంతకంటే విశేషంగా హృదయ మందిరాలను పునరుద్ధరించుకొని నిషిద్ధమైన వాటిని తొలగించుకొని, దేవుని సన్నిధిని స్థాపించాలి. భౌతిక ఆచార, వ్యవహారాలు కొంతవరకు ప్రాముఖ్యమే గాని అంతరంగ శుద్ధి ఎంతో ప్రాముఖ్యం. యేసుప్రభువు తన ఉపదేశాలలో ఈ సంగతిని స్పష్టంచేశారు. మార్కు 7 : 21-23 - "లోపల నుండి, అనగా మనుష్యుల హృదయములోనుండి దురాలోచనలును, జారత్వము లును, దొంగతనములును, నరహత్యలును, వ్యభిచారములును, లోభములును, చెడు తనములును, కృత్రిమమును, కామవికారమును, మత్సరమును, దేవదూషణయు, అహం భావమును, మరియు అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలువెళ్ళి అపవిత్రపరచునని ఆయన(యేసు) చెప్పెను". జీవధారలు ప్రవహింపవలసిన

మానవ హృదిలో, జీవనాశనము కలిగించు అపవిత్ర ప్రవాహములకు మూలమైనవి!! "నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటే ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము" (సామెతలు 4 : 23). "యెరూషలేమా, నీవు రక్షింపబడునట్లు నీ హృదయములోనుండి చెడుతనము కడిగివేసుకొనుము. ఎన్నాళ్ళ వరకు నీ దుష్టాభిప్రాయములు నీకు కలిగియుండును?" (యిర్మియా 4 : 14). "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నామనవి వినకపోవును" (కీర్తనలు 66 : 18). "... గిన్నెయు, పళ్ళెమును వెలుపల శుద్ధియగునట్లుగా ముందు వాటిలోపల శుద్ధిచేయుము" (మత్తయి 23 : 26).

పై లేఖనములను పరిశీలించినప్పుడు మానవ హృదయ మందిరాలను దేవుడు ప్రధానంగా కోరుకుంటున్నాడు. విమోచింపబడిన ప్రజలు కలుసుకునే అద్భుత స్థలం ప్రార్థనామందిరము. అదికూడా విశేషమైన, మరియు ప్రాధాన్యమైన స్థలము. అయితే, ఈ రోజుల్లో అనేకమంది భక్తులు హృదయ శుద్ధిగలిగి దేవుని ఆరాధించటం కంటే, వ్యక్తిగత ప్రాధాన్యత, హోదాల మధ్యలో భక్తిని జరిగిస్తున్నారు. అనుకూల భక్తిని చేస్తున్నారు. "... జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని, సత్యమునకు చెవినియ్యక, కల్పనా కథలవైపునకు తిరుగు కాలము వచ్చును" (2 తిమోతి 4 : 3-4). ప్రస్తుత భక్తి పోకడలను పరిశీలించినప్పుడు, చాలామట్టుకు భౌతిక మందిర నిర్మాణాలను సుందరంగా, సౌకర్య వంతంగా నిర్మించుకోవాలనుకుంటున్నారు. మంచిదే. అదే సమయంలో సంఘ నాయకత్వం ప్రజల గుండెలను ప్రభుబోధలతో ప్రక్షాళనచేసి, దేవుని సన్నిధిని స్థాపించటం అత్యంత ప్రాముఖ్యం.

"హిజ్కియా యూదా దేశమంతటను.. తన దేవుడైన యెహోవా దృష్టికి అనుకూలముగాను, యదార్థముగాను, నమ్మకముగానూ పనిచేయుచూ వచ్చెను. తన దేవుని ఆశ్రయించుటకై దేవుని మందిరసేవ విషయమందేమి... ధర్మమంతటి విషయమందేమి తాను ఆరంభించిన ప్రతి పని అతడు హృదయపూర్వకముగా జరిగించి వర్ధిల్లెను" (2 దినవృ॥ 31 : 20-21).

అంతా సవ్యముగా జరుగుతున్నప్పుడు, అష్షూరు రాజైన సన్హెరీబు యూదా దేశము మీదకు దండెత్తి వచ్చాడు. ఇంతకు ముందుకూడా ఓసారి దాడియత్నం చేసినప్పుడు కొంత భరణం చెల్లించి బయటపడ్డాడు (2 రాజులు 18 : 15-17). అయితే రెండవసారి దండెత్తి వచ్చినప్పుడు హిజ్కియా దేవుని బట్టి ధైర్యము తెచ్చుకొని తనదేశ ప్రజలలో ధైర్యాన్ని నింపాడు. "మీరు దిగులు పడకుడి, ధైర్యము విడవకుడి, అష్షూరు రాజునకైనను అతనితో కూడనున్న సైన్యమునకైనను మీరు భయపడవద్దు, విస్మయమొందవద్దు. అతనికి కలిగియున్న సహాయం కంటే ఎక్కువ సహాయం మనకు కలదు. మాంస సంబంధమైన బాహువే అతనికి అండ. మనకు సహాయము చేయుటకును, మన యుద్ధములు

జరిగించుటకును మన దేవుడైన మనకు తోడుగా ఉన్నాడని చెప్పగా జనులు యూదా రాజైన హిజ్కియా చెప్పిన మాటలయందు నమ్మకముంచిరి (2 దినవృ॥ 32 : 7-8). నిజమైన నాయకుని లక్షణం యిదే. తననాశ్రయించిన ప్రజలకు ధైర్యంచెప్పి వారిని ఓ శక్తిగా మార్చాడు. సంక్లిష్ట పరిస్థితులలో కాడిపారేయటం, నేను చేసేదేదో చేశాను, ఇక నావల్లకాదనటం, ప్రతికూల పరిస్థితులలో నిద్రాణంగా ఉండటం నాయకుల లక్షణం కాదు. ప్రజలలోనుండి పుట్టేవాడే నాయకుడు. సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించి, తమ్మును తాము కాపాడుకొని పోషించుకునే వారిగా తయారు చెయ్యాలి. సంక్లిష్ట సమయాలలో అనుచరులకు రక్షణగా ఉండి, ముందుండి నడిపించేవాడే నాయకుడు. ఏర్పాటు చేయబడిన వ్యవస్థలను కొనసాగించే నాయకులను తయారుచేసేవాడే నాయకుడు. ఎంతసేపూ మన సంఘం వృద్ధిచెందాలనే కాంక్ష మాత్రమే గాక, ప్రజలను ప్రభువు దగ్గరకు నడిపించే నాయకులను తయారుచేయాలనే కాంక్ష కలిగినవాడే నాయకుడు. హిజ్కియా అద్భుతంగా, దైవికంగా స్పందించి తన దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చాడు.

అష్షూరు రాజు హిజ్కియాను హెచ్చరించటంతోపాటు దేవుని కూడా తేలికచేసి మాట్లాడాడు. "... యెరూషలేము అష్షూరు రాజు చేతికి అప్పగింపబడదని చెప్పి నీవు నమ్ముకొనియున్న నీ దేవునిచేత మోసపోకుము" (2 రాజులు 19 : 10). ఇలాంటి అవమాన కరమైన సందర్భములో హిజ్కియా దేవుని సన్నిధిలో అభ్యర్థించాడు. "హిజ్కియా దూతల చేతిలోనుండి ఆ ఉత్తరము తీసుకొని చదివి... మందిరమునకు పోయి యెహోవా సన్నిధిని దాని విప్పి పరచి... ప్రార్థన చేసెను... యెహోవా చెవియొగ్గి ఆలకింపుము... జీవముగల దేవుడవైన నిన్ను దూషించుటకై సన్హెరీబు పంపినవాని మాటలను చెవినిబెట్టుము... అతని చేతిలోనుండి మమ్మును రక్షింపుము" (2 రాజులు 19 : 14-19). హిజ్కియా చేసిన ప్రార్థనలో జ్ఞానమున్నది. అనవసర, అసందర్భ మాటలకు తావులేకుండా, ప్రార్థనను ప్రార్థనగా జరిగించి బాధ్యతను దేవుని చేతిలో పెట్టాడు. సంక్లిష్ట సందర్భాలలో జ్ఞానముతో వ్యవహరించటం, ప్రార్థించటం ప్రయోజనకరం. "అంతట ఆమోజు కుమారుడైన యెషయా హిజ్కియా యొద్దకు ఈ వర్తమానము పంపెను - ఇశ్రాయేలీయుల దేవుడగు యెహోవా సెలవిచ్చిన దేమనగా - అష్షూరు రాజైన సన్హెరీబు విషయమందు నీవు నా యెదుట చేసిన ప్రార్థన నేను అంగీకరించియున్నాను" (2 రాజులు 19 : 20). దేవునిచేత అంగీకరించబడే దైవసేవ, ప్రార్థనలు, సభలు అవసరం గాని, అనవసర ఆధ్యాత్మిక కార్యక్రమాలవల్ల పెద్ద ప్రయోజనం లేదు. దేవునిచేత అంగీకరించబడాలంటే హంగు, ఆర్భాటాలు అక్కర్లేదు. అంతరంగ శుద్ధి, విశ్వాస విధేయతలుంటే చాలు. నిస్వార్థంగా, కళంకంలేకుండా దేవుని పేర ఏంజరిగించినా చక్కటి ఫలితాలొస్తాయి. నాసిరకపు భావాలకు దూరంగా ఉండి నాణ్యమైన భక్తిని జరిగిస్తే అద్భుతఫలితాలు పొందటం సాధ్యం.

దేవుడు యూదా రాజ్యమునకు అష్షూరు రాజు చేతిలోనుండి విజయమివ్వటానికి ముందు ఓ సంగతిని తీవ్రంగా పరిగణించాడు. అదేమనగా, "నీవు ఎవరిని తిరస్కరించితివి? ఎవనిని దూషించితివి? నీవు గర్వించి ఎవనిని భయపెట్టితివి? ఇశ్రాయేలీయుల పరిశుద్ధ దేవుడినే గదా! నీ దూతలచేత యెహోవాను తిరస్కరించి పలికిన మాటలివేగదా... నామీద నీవు వేయు రంకెలును నీవు చేసిన కలహమును నా చెవులలో చొచ్చెను. నీవు వచ్చిన మార్గముననే నిన్ను మళ్లించెదను" (2 రాజులు 19 : 22-28). దేవునికి, దేవుని ప్రజలకు వ్యతిరేకంగా, అక్రమంగా ఎవరు మాట్లాడినా దేవుడు వింటున్నాడు. దేవుని సంఘముపై కొంతమంది వేసే రంకెలు ఆయనకు వినబడుతున్నాయి. ఆవిషయంలో మారుమనస్సు పొందకపోతే బహుప్రమాదం. అష్షూరు వారికి తగిన శాస్తి జరిగింది.

2 రాజులు 19 : 30-33 - "యెషయా చెప్పినదేమనగా, హిజ్కియా నీకిదే సూచన యగును. ఈ సంవత్సరము దానంతట అదే పండు ధాన్యమును, రెండవ సంవత్సరమందు దానినుండి కలుగు ధాన్యమును మీరు భుజింతురు. మూడవ సంవత్సరమున మీరు విత్తనము విత్తి కోయుదురు... అష్షూరు రాజు... ఈ పట్టణములోనికి రాడు. దానిమీద ఒక బాణమైనను ప్రయోగింపడు.. తాను వచ్చిన మార్గముననే అతడు తిరిగిపోవును". దేవుడు యూదావారికి ఓ విశేష దీవెన ననుగ్రహించాడు. అదేమనగా, వారి పొలాలలో దానంతట అదే పండు ధాన్యమును ఆహారంగా యిచ్చాడు. ఇది ఎక్కడన్నా ఉంటుందా!!? రెండవ సంవత్సరం కూడా దాదాపు అంతే... దేవుడు చేసే కార్యాలు మన మేథస్సుకు అందవు. దేవునిపై ఆధారపడేవారికి దేవుడెప్పుడూ ఊహించని, అసాధారణ, అసహజ దీవెనలనుగ్రహిస్తాడు.

2 రాజులు 19 : 35 6 "ఆ రాత్రియే యెహోవా దూత బయలుదేరి అష్షూరు వారి దండుపేటలో జొచ్చి లక్షా ఎనభైఐదు వేల మందిని హతము చేసెను" దేవుడు యూదా దేశానికి గొప్ప విజయమిచ్చాడు. గర్వాంధులు కూలిపోయారు. అష్షూరు రాజైన సన్హెరీబు తిరిగి నినెవె పట్టణమునకు వెళ్ళిపోయాడు. కొంతకాలమైన తరువాత నిస్రోకు దేవాలయము లో మ్రొక్కుచుండగా అతని కుమారులైన అద్రమ్మెలెకును, షరెజెరును ఖడ్గముతో అతని చంపారు (2 రాజులు 19 : 36-37). చివరికి సన్హెరీబు తన కుమారుల చేతిలో హతుడయ్యాడు. దేవదూషణ చేసి, దేవుని ప్రజలపై యుద్ధం చేయదలచి, భంగపడి అంతమయ్యాడు. దేవుని సంఘమును, నిస్వార్ధ దేవుని సేవకులను దూషించటం ప్రమాదకరం (2 దినవృ॥ 32 : 21-23).

సంక్లిష్ట సమయంలో హిజ్కియా దేవునిపై, దైవజనుడైన యెషయాపై ఆధారపడి, సూచనల మేరకు నడుచుకొని సంరక్షింపబడ్డాడు. దేవుని అభ్యర్థించి, ఆ దేవుడు చెప్పినట్లు చేసి అందరికి ఆశీర్వాదమునందించిన హిజ్కియా ఈ విషయంలో ఆదర్శవంతుడు. దేవుని ననుసరించి, సూచనలను పాటించి దీవెనలు పొందుదాం. **( సశేషం )**

# మరనాత థియెలాజికల్ సెమినరి
## హైదరాబాద్ - 15 వ స్నాతకోత్సవ నివేదిక

మరనాత మెసేంజర్ పాఠకులందరికి యేసునామములో శుభములు.

దేవుని దివ్య సంకల్పాన్ని బట్టి మరియు మీరందిస్తున్న ప్రార్థన సహకారంతో 15వ స్నాతకోత్సవ వేడుక జూన్ 16, ఆదివారం ఉదయం 10 గంటలకు మరనాత ప్రార్థన మందిరము నందు అత్యంత వైభవంగా జరుగుటనుబట్టి ఆనందిస్తున్నాము. అనంతరం మరనాత విశ్వాస సమాజము గాయకబృందం ఆత్మీయ గీతాలతో స్తుతిఆరాధనలో ఆహూతులను ఆనందపరచారు. ప్రత్యేక కార్యక్రమమునకు విచ్చేసిన ఆహ్వానితులు లేచి నిలువబడగా డా॥ నిరీక్షణ కంచర్ల గారి రచన, స్వరకల్పనలో రూపుదిద్దుకున్న పాట (ఎపుడైనా నీ కొరకె) ఆలపిస్తుండగా దైవజనులు ఉపాధ్యాయుల బృందం పట్టభద్రులు కావలసిన విద్యార్థిని విద్యార్థులు తరగతులవారిగ సభలో ప్రవేశించి వారికి ఏర్పరచిన వేదికను అలంకరించిరి. తదుపరి డా॥ నిరీక్షణ కంచర్ల గారి స్వాగత పలుకులతో పట్టభద్రులను, ముఖ్య అతిధులను సభకు పరిచయం చేశారు.

పిమ్మట స్టూడెంట్ డీన్ రెవ. పరంజ్యోతి గారు మాట్లాడుతూ - మరనాత థియెలాజికల్ సెమినరి కేవలం అకాడమిక్స్‌ను మాత్రమే దృష్టిలో పెట్టుకొనక, భవిష్యత్తులో దేవుని కొరకు దేశం కొరకు ప్రజలయొక్క రక్షణార్థమై జీవితాన్ని అంకితం చేసుకొన్న వారి ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించుటకు బహుగా కృషి చేస్తుంది అనుటలో ఎటువంటి సంశయంలేదని, రోజుకు మూడుసార్లు విద్యార్థిని విద్యార్థుల ఆధ్యాత్మిక జీవితాన్ని బలపరుస్తు, దేవుని వాక్య పరిజ్ఞానములో వారిని పెంపొందించుటకు మరియు వారి ప్రార్థన జీవితాన్ని దృఢపరచుటకు వారి నిమిత్తమై సామూహిక మరియు వ్యక్తిగత ప్రార్థనలు, ఉపవాస కూడికలు ఆయా సమయములలో ప్రత్యేక సెమినార్‌లు మరనాత థియెలాజికల్ సెమినరి వారికొరకు నిర్వహించుచున్నదని తెలిపారు. ప్రతి విద్యార్థిని దేవుని వాక్య జ్ఞానముతో వెలిగించి, అనేకమందిని ప్రభువువైపునకు ఆకర్షితులను చేయునట్లు మరనాత థియెలాజికల్ సెమినరి కృషిచేస్తుందని, ఆర్థిక స్థోమతలేని పేద విద్యార్థిని విద్యార్థులకు వారి వేదాంత విద్యలో ప్రతిభననుసరించి, మంచి ప్రవర్తన కలిగినవారికి స్కాలర్‌షిప్ సదుపాయం కూడా కల్పిస్తుందని తెలిపారు.

అనేకమందిని స్తుతి ఆరాధనలో నడిపించుటకు గాను, వాక్యాన్ని సరిఅయిన పద్ధతిలో వ్యాఖ్యానించి, వీనులకు విందులు కలిగించు రీతిలో బోధించుటకు వారినిమిత్తమై వ్యాఖ్యాన శాస్త్రము, ప్రసంగ శాస్త్రమును బోధించుచు విద్యార్థులను బలపరచుచున్నదని బైబిల్ జ్ఞాన సంపదను అనుభవించుటకు వారికొరకు బైబిల్ గ్రంథములో ప్రతి పుస్తకమునందు పటిష్టమైన పట్టును సంపాదించుటకు వారికొరకు సుమారుగా 35 బైబిల్‌క్విజ్ కార్యక్రమములు నిర్వహించడానికి సహాయము చేసిన దేవాదిదేవునికి మహిమ కలుగును గాక! వ్యక్తిగతంగా విద్యార్థులతో సమయము గడుపుచు, ఆధ్యాత్మికంగా వెనుకంజలో వున్నవారికి వాక్యానుసారమైన సలహాలు, సూచనలు అందిస్తు **MTS** వారినిమిత్తమై కౌన్సిలింగ్ తరగతులు నిర్వహిస్తు,

విద్యార్థులకు మనోనిబ్బరాన్ని కలిగించుచు, వీరి ఆధ్యాత్మిక క్షేమాన్ని పరిచర్యలో కాంక్షిస్తు దేవుని సేవలో గొప్పభారాన్ని కలిగియుండాలని, దేశవిదేశాలనుండి సేవలో అపార అనుభవము కలిగిన అభిషిక్తులైన దైవజనుల బోధనలద్వారాను వారు పరిచర్యలోఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేస్తు క్రైస్తవేతర సమాజములో క్రీస్తుకొరకు పౌరుషము కలిగిన సేవకులుగా వుండాలని ఉత్తేజపరచుచు విద్యార్థులను సంపూర్ణ సేవకు సిద్ధపరచుటలో **MTS** శ్రమ బహుప్రశంసనీయం అని కొనియాడారు.

రానున్న రోజులలో మరెన్నో కార్యక్రమముల ద్వారా విద్యార్థుల ఆధ్యాత్మిక జీవితాన్ని అభివృద్ధిపరచాలని తెలుగు రాష్ట్రాలలో, పట్టణాలలోను, గ్రామాలలో చక్కటి తర్ఫీదుపొందిన **MTS** సేవకులు విస్తరించాలని గొప్ప ప్రణాళికను కలిగియున్నది. **MTS** యువతి యువకులకు, దేవుని మహిమ కలిగిన సేవచేయాలనే ఆశ కలిగినవారికి చక్కటి క్రమశిక్షణ, నైతిక మరియు ఆధ్యాత్మిక ఉన్నత విలువలను ప్రసాదించగలిగిన వేద విద్య శిక్షణ కేంద్రమనే సంగతిని స్పష్టంచేశారు. దేవుని కొరకు నేను మండాలి, అనేకులను మండించాలి, ప్రభు రాజ్యాన్ని విస్తరింపచేయాలనే తాత్పర్యము అంకితభావము కలిగినవారిని **MTS** ప్రోత్సహించి, బైబిల్ వేద విజ్ఞానాన్ని అందించి సేవకొరకు సిద్ధంచేస్తుందని తెలియజేస్తు, ఈ పరిచర్యను చక్కటి విధి విధానాలతో ఆధ్యాత్మిక సూత్రాలతో ముందుకు నడిపిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షులు దైవజనులు శ్రీ గుల్లపల్లి మోజెస్ చౌదరి గార్కి **MTS** కుటుంబం తరపున హృదయ పూర్వక వందనాలు తెలియజేసి మాటలు ముగించారు.

అనంతరం అకాడమిక్ డీన్ మైటిపోరస్ గారు 2018-2019 విద్యాసంవత్సర వార్షిక నివేదికను తెలియజేస్తు, **MTS** దర్శనాన్ని జ్ఞాపకంచేసి ప్రస్తుతం మరనాత థియెలాజికల్ సెమినరి నందు 50 మందికి పైగా, విద్యార్థినీ విద్యార్థులు వివిధ తరగతులలో వేదవిద్య నభ్యసించారని, 10 మంది ఆచార్యబృందం కలసి అంకితభావంతో బోధనభారం కలిగి వేదవిద్యను అందిస్తు విద్యార్థుల గుండెల్లో సువార్తపట్ల ఆసక్తిని కలిగిస్తున్నారని, ఆనందాన్ని వ్యక్తపరిచారు. రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగువారి ప్రయోజనార్ధమై మరనాత థియెలాజికల్ సెమినరి యాజమాన్యం **B.Th., Dip.Th.** కోర్సులు ఇంగ్లీష్ మరియు తెలుగు భాషలలో **ATA** ద్వారా అందిస్తు, **C.F.N.A.B.S - USA** వారి ద్వారా **M.Div.** కోర్సును చేయడానికి అవకాశం కల్పిస్తున్నారని తెలియజేశారు.

షుమారుగా ఈవిద్యాసంవత్సరం ఈవిద్యార్థిని విద్యార్థులకు 112 సబ్జెక్టుల బోధనతోపాటు 800 గంటలు లైబ్రరి సదుపాయం, 25 వీడియో తరగతులు, 12,000 పుస్తకాలు, 32 కు పైగా మాసపత్రికలు మరియు వందలాది ఇ-పుస్తకాలు కలిగిన గ్రంధాలయ సదుపాయం, 5,376 గంటలు అధ్యాపకులద్వారా విద్యాబోధనను అందించటం జరిగినదని తెలిపారు. అంతే కాకుండా 2003 సంవత్సరం నుండి యిప్పటికి 265 మంది పట్టభద్రులలో కొందరు ఉన్నత విద్యను అభ్యసించుచుండగా, మరికొందరు (90) సంఘస్థాపన జరిగించుచు వివిధ పరిచర్య లలో కొనసాగుతున్నారని తెలియజేశారు.

తరువాత మరనాత థియెలాజికల్ సెమినరి ఉపాధ్యాయులు పరిశుద్ధ గ్రంథంలో నుండి మత్తయి 28 : 18-20; 2 కొరింథి 4 : 7-18; 2 తిమోతి 2 : 15-26 వాక్యభాగములను చదివి వినిపించారు.

అనంతరం శ్రీమతి తబిత కంచర్ల గారు మాట్లాడుతు ద్వితియోపదేశకాండం 31 : 7,8 వ్రాయబడిన ప్రకారము ఆనాటి ఇశ్రాయేలు ప్రజలను నీముందర నడుచువాడు యెహోవా ఆయన నీకు తోడైయుండును ఏలాగు దేవుడు ధైర్యపరచాడో, ఆరీతిగానే ఆయన మిమ్మును బలపరచి నడిపించునని పట్టభద్రులు కాబోతున్న విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించారు. అదేరోజు ఫాదర్స్ డే కావడంతో తన తండ్రిగారైన మోజెస్ చౌదరి గారితో కలసి స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొనడం గొప్ప ధన్యతగా భావించారు. నాన్నగారు మరనాత విశ్వాస సమాజమును స్థాపించి, అనేకులకు వారు ఆత్మీయ తండ్రిగాను, తనకు శరీర జన్మను మాత్రము గాక ఆత్మీయ జన్మను ప్రసాదించిన జనకులని కొనియాడినారు. వారి ఆదరణ, ఆప్యాయతలు, ఆత్మీయ నాయకత్వం, ప్రజల రక్షణపట్ల భారం ప్రసంశనీయమని, అనేకులకు ఆదర్శప్రాయుడని అభినందించినారు. ఎంతో వ్యయప్రయాసములతో ఈ పరిచర్య నడిపించబడుతుందని తెలియజేసిరి. పట్టభద్రులు కావలసిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేయగా, వయస్సులో పెద్దవారైన కొందరు స్థానిక సంఘ విశ్వాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిని సన్మానించారు.

అనంతరం సోదరులు జార్జిగారు మత్తయి సువార్త 4 : 1-4 వచనాలను ఆధారంచేసుకొని, యేసుక్రీస్తు భూమి మీద తన పరిచర్యను పరిక్షలతో ప్రారంభించాడని, పరిక్షలయొక్క ముఖ్య ఉద్దేశం విజయమేనని సేవలో వెనుకంజవేయని స్థిరమైన స్థితిని కలిగియుండుట కొరకేనని, పరిచర్యలో మన కీర్తి ప్రశంసలు, ప్రవర్తన పరీక్షించబడుతుందని హెచ్చరికచేస్తు, తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెనని, మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపదని, తప్పించుకొను మార్గమును కలుగజేయును అని పట్టభద్రులకు హితోపదేశం చేసారు.

అటుతరువాత వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తు తాను 56 సంవత్సరాల క్రితం దేవుని చేత సంధించబడి ఆరోజునుండి ఈరోజువరకు ఆ మహాదేవునితో సంబంధం కలిగి నన్నునేను పలుసందర్భాలలో విమర్శించుకొనుచు సేవలో కొనసాగుచున్నానని, “పర విమర్శ కంటే స్వీయ విమర్శ చాలా గొప్పదని” తెలియజేసి, 2 థెస్సలోనిక 1 : 7-12 వచనాలనుండి అపోస్తలుడైన పౌలు విశ్వాసులపట్ల తనవైఖరిని వివరించారు. పౌలు తన విశ్వాసులపట్ల తాను కలిగియున్న తల్లి తండ్రి బాధ్యతలు బహు ప్రశంసనీయమని కొనియాడారు. ఒక తల్లి తన బిడ్డకు బహు వేదనతో జన్మనిస్తుందని ఆ వేదనను ఎవరు గ్రహించజాలరని, తన బిడ్డను ఎంతో ప్రేమతో ఆప్యాయతతో పెంచుతుందని, ఒకతల్లి తనబిడ్డకు పాలివ్వాలంటే ఏడు రక్తపుచుక్కలు విరిగితే ఒక పాలచుక్క అవుతుందని

తల్లి ప్రయాసమును కళ్ళకు కట్టినట్టు వివరించారు. తల్లి బిడ్డను మోస్తే, ఆ తల్లిని బిడ్డను మోసేది తండ్రని యజమాని పాత్రను అభినందించారు. తల్లి తండ్రి ఇద్దరిలో ఒకరిని ఎక్కువ చేసి ఇంకొకరిని తక్కువ చేయకూడదని, పిల్లల జీవితంలో ఇరువురి పాత్ర అమోఘం అని తన తల్లి తనను పెంచిన విధానం జ్ఞాపకంచేసారు. తల్లిదండ్రులతో మనమెట్టి సంబంధ సహవాసం కలిగియుంటామో పరిచర్యలో అడుగుపెట్టబోయే మీరు ఆ దేవాది దేవునితో నిత్య సంబంధం కలిగి సేవలో కొనసాగాలని, దేవుడు బిజిగా వుండువారితో మాట్లాడడని తనతో సమయం గడుపువారికి తన ఆలోచనను అద్భుత ప్రణాళికలను మార్గములను తెలియజేస్తాడని పట్టభద్రులు కాబోతున్న విద్యార్థిని విద్యార్థులను ఉత్సాహపరచారు. సేవా పొలములోనికి వెళ్లే మీరు అనేకుల జీవితాలలో సువార్త విత్తనములు విత్తువారుగా వుండాలని, పెరికేవారుగానో లేక పాడుచేసేవారుగా ఉండకూడదని హెచ్చరిక చేసారు. మనం ప్రకటించు సువార్త క్షయముకాని సువార్త, అనేకులను రక్షణలోనికి నడుపు రక్షణసువార్త అని వేదికలను ఆశించకుండ వినయ విధేయతలతో, అంకితభావంతో ఓర్పు, సహనంతో ప్రకటించాలని ఆకాంక్షించారు. కొంతమంది సంఘాలకు నీరుపోయువారుగాను మరికొందరు ఎండగట్టువారుగాను తుదకు ఎండిపోవువారుగాను వుందురు. మీరు అలాగున ఉండక క్రీస్తు జీవం కలిగినవారుగాను రక్షింపబడువారికి జీవార్థమైన జీవపు వాసనగా వుండాలని, పట్టభద్రులను ఉజ్జీవింపజేసారు. సేవా పరిచర్యలో ప్రతిఒక్కరిపట్ల సానుకూలత కలిగి అయోగ్యులైన వారిని బాగుచేసి వారిని పనికివచ్చే పాత్రలనుగా చేయాలేగాని వారిని తొలగించువారుగా వుండకూడదని, విలియంకేరీ తన 16 సంవత్సరాల వయస్సులో బూట్లు బాగుచేసేవాడని, తనయొద్దకు వచ్చేవారితో నేను క్రొత్త బూట్లు తయారుచేయవలెనని, పాత బూట్లను బాగుచేయగలనని చెబుతుండేవాడని, తాను జాన్‌వెస్లి ప్రసంగాన్ని విని మారుమనస్సు పొంది జీవితాన్ని ప్రభువుకి అంకితం చేసుకున్నాడని, బైబిల్ గ్రంథాన్ని అనేక భాషలలోనికి తర్జుమా చేసిన ఆధునిక మిషనరీ పితామహుడని, తాను పరిచర్య విషయంలో వెనుకంజవేయని వీర సైనికుడని గుర్తుచేసారు. చివరికి తన కొడుకు పీటరు చనిపోయినప్పుడు సమాధిపెట్టె తయారుచేసేందుకు ఒడ్రంగి లేకపోవడం, తుదకు ముస్లింవారి సహకారంతో గుంట త్రవ్విస్తే ఆ గుంటత్రవ్వినవారిని ఆ గ్రామం నుండి వెలివేసారని, చివరికి తానే రెండురోజుల తర్వాత ఇద్దరు పనివారి సహాయంతో ఒక కొబ్బరి మట్టపై శవాన్ని మోసికొనివెళ్ళి జడివానలో భూస్థాపన చేసిన విధానాన్ని జ్ఞాపకంచేసి పట్టభద్రులను ఉద్వేగపరచారు. తాను ఇంత గొప్పసేవచేసి కడకు 1834 జూన్ 9వ తేదీన తన మరణ సమయంలో తనకు అత్యంత ప్రీతిపాత్రమైన ఐజక్ వాట్స్ రచనల్లోని మాటలు ("నీచుడను, దరిద్రుడనూ, నిస్సహాయ పురుగునూ అయిన నేను నీ జాలిగల చేతుల్లోకి వాలిపోతున్నాను ప్రభూ!") తన సమాధిపై వ్రాయాలని కాంక్షించి, నిత్య విశ్రాంతిలోకి తృప్తిగా కళ్ళు మూసిన విధానాన్ని ప్రస్తావిస్తూ మీరును అట్టి సేవకులుగా వుండాలని ప్రోత్సహిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

**( మిగతా 26 వ పేజీలో... )**

# నూతన శక్తి

**సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

మరనాత మెసెంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు. మానవుడు ఏదో ఒక నూతనత్వం కోరుకోవటం సహజం. తనకున్న కష్ట, క్లిష్ట పరిస్థితుల మధ్య నూతన ఉత్సాహాన్ని, ఆ పరిస్థితులను అధిగమించగల నూతన బలము కావాలి. "యెహోవా కొరకు ఎదురుచూచువారు నూతన బలము పొందుదురు"(యెషయ 40 : 31) అని పరిశుద్ధ లేఖనాలు సెలవిస్తున్నాయి. క్లిష్టపరిస్థితులలో దేవుని యొక్క బలమును పొందుకుని, తమ జీవితాలను దేవునిలో సంతోషంగా గడిపినవారిలో దావీదు ఒకడు. మరి ఆ నూతన బలమును సంతరించుకొనుటకు మనం చేయవలసినదేమిటో వాక్యపు వెలుగులో పరిశీలన చేద్దాం.

**1. దేవునియందు నమ్మకముంచుట (కీర్తన 37 : 3) :-** మనలను సృష్టించిన సృష్టికర్తయైన దేవునియందు తప్పక నమ్మకముంచాలి. దేవుడు మానవులమైన మనలను నమ్మి ఈ జీవితాలను బహుమానాలుగా మనకు అప్పగించాడు. కనుకనే దేవుడు మన జీవితాలను సరియైన మార్గములో నడిపించగలవాడని నమ్మవలెను. సహజంగా మానవులు తమకున్న ఘనత, పేరుప్రఖ్యాతులు, గొప్పతనమును నమ్మి సంతోషిస్తూ ఉంటారు. క్రీస్తు పిల్లలుగా ఎంచబడిన మనలో సహితం చాలామంది దేవునిమీద కాక తమ నమ్మకాన్ని తమకున్న సామర్థ్యం, తలాంతులపై నిల్పుతారు. అయితే రాజైన దావీదు తనకు అంగబలం, అర్థబలం ఉన్నప్పటికిని, రాజ్యాధికారం లేక మరి ఏ యితర పేరు ప్రఖ్యాతులవైపు చూడక దేవునిమీద తన నమ్మకాన్ని నిల్పటం ఎంతైనా ఆశ్చర్యం. అందుకే 'దేవుని నమ్ముకొనుము నా ప్రాణమా ఆయనే నాకు కేడెమునై యున్నాడు' అని ధైర్యంగా చెప్పగలిగాడు (కీర్తన 33 : 21). దేవుని నమ్మటంలోనే నిజమైన ఆనందం, జీవితానికి రక్షణ, కాపుదల అనేవి దొరుకుతాయి (కీర్తన 56 : 4,11). దావీదు రాజు దేవుని నమ్మటంవలన ఎంతోమంది శత్రువులు తన సైన్యంపైకి వస్తున్నప్పటికి పిరికిపందలా భయపడి పారిపోలేదు, దుఃఖంలో నిలిచిపోలేదు గాని ధైర్యంతో శత్రువులను జయించాడు. సంతోషంతో దేవునిని ఆరాధించాడు. అందుకే దేవుని పిల్లలముగా మనము మన దేవునిపై నమ్మకముంచుటయే ప్రథమ కర్తవ్యంగా ఉండాలి.

**2. దేవునిని బట్టి సంతోషించుట (కీర్తన 37 : 4) :-** దేవునిని కలిగిన ప్రజలు దేవునిలో సంతోషించటం నేర్చుకోవాలి. దేవుడు మనకు యిచ్చిన ఆశీర్వాదాలను బట్టి ఎంత సంతోషిస్తామో అదేవిధంగా ఆయన చెప్పిన పనిని చేయటంలో కూడా ఆనందించాలి. తద్వారా దేవుడు మనలను చూచి సంతోషిస్తాడు. ఎంత పనిచేస్తాము,

దేవునికి ఎంత యిచ్చామో అనేది కాదుగానీ ఏవిధమైన భావనతో చేస్తున్నామనే దానియందు దేవుడు లక్ష్యముంచి సంతోషించును. రాజుగా రాజ్య భారమును వహిస్తూ, అందరిపై అజమాయిషీ చేస్తున్న దావీదు, దేవునిని, దేవుని పనిని నిర్లక్ష్యం చేయకుండా ఓ గొప్ప సంతోషాన్ని వ్యక్తం చేసాడు. అందుకే నీ చిత్తం నెరవేర్చుట నాకు సంతోషము అని తన హృదయస్పందనను వ్యక్తం చేసాడు (కీర్తన 40 : 8). దేవుని పనిని సక్రమంగా నెరవేర్చుట వలన మనము సంతోషంగా ఉంటూ దేవునికి సంతోషమును కలుగజేసిన నిజమైన పిల్లలమౌతాము. దేవుని కోసం ఏపని చేసినా సణుగులతో కాక సంతృప్తితో, సరియైన హృదయంతో చేయటం మంచిది. అంటే మన యిష్టాయిష్టాలతో కాక దేవుని సంతోషంకోసం ఆయన చెప్పిన పనిని చేయటం మంచిది.

**3. మన మార్గములను దేవునికి అప్పగించుట (కీర్తన 37 : 5) :-**
మన జీవితాలను, మన ఆలోచనలను, మన విధానాలను ప్రతిదానిని దేవునికి అప్పగించాలి. అనగా మనము ఎంతగా దేవునిని నమ్ముతున్నాము అనే విషయం మన మార్గములను దేవునికి అప్పగించే విషయం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. మనము చేసే ప్రతి పనిలో దేవునికి ప్రథమ స్థానం యివ్వటం నేర్చుకోవాలి. కొంత సమయం దేవునిలో, కొంత సమయం లోకములో కాక మన జీవితాలను పూర్తిస్థాయిలో దేవునికి అప్పగించాలి. కొన్ని సార్లు దేవునికి మనం అప్పగించుకున్నాం అంటూనే క్లిష్టసమయాలలో మన స్వసిద్ధాంతాలను, యిష్టానుసారమైన పద్ధతులను వెతుక్కుంటూ ఉంటాము. అలా చేస్తూ ఒకవేళ అపజయం ఎదురైతే దేవుని మీద నిందవేస్తాము. భక్తుడైన దావీదు గొల్యాతును ఎదురించవలసి వచ్చిన సమయంలో తాను, చేయబోతున్న కార్యమును అప్పగించుకొన్నాడు. సహజ, సంతోష స్థితులలో ఎలా దేవునికి తనను తాను అప్పగించుకున్నాడో అదేవిధంగా క్లిష్ట సమయంలో అప్పగించుకొని జయం పొందుకున్నాడు. తన ముందున్న యుద్ధం చేసేది తానుకాదు కాని తన మార్గములను సరియైన పంథాలో నడిపిస్తున్న దేవుడే జరిగిస్తాడని 'యుద్ధము యెహోవాదే' (1 సమూయేలు 17 : ) అని ప్రజలందరి ముందు నినాదమిస్తూ గొప్ప విజయ వీరుడుగా చరిత్రలో నిలిచిపోయాడు.

**4. దేవునికొరకు కనిపెట్టుము (కీర్తన 37 : 7) :-** దేవుని కొరకు సహనముతో కనిపెట్టాలి. మనలో చాలామంది దేవుడు మనం అనుకున్న సమయంలో పనిచెయ్యాలని కోరుకుంటాం. ఒకవేళ అలా జరుగకపోతే అసహనంతో దేవునిపై అసంతృప్తి వ్యక్తంచేస్తాము. ప్రవక్తయైన సమూయేలుచే రాజుగా అభిషేకం పొందుకున్న దావీదును రాజుగా వెంటనే సింహాసనంపై దేవుడు కూర్చుండబెట్టలేదు. కొంత పరీక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. సౌలు తనను తరుముతూ ఉంటే సహనంతో ఎదుర్కొన్నాడు అని చెప్పకతప్పదు. ఆ విషయంలో

**( మిగతా 26 వ పేజీలో... )**

# మరనాత బిబ్లికల్ సెమినరి
## 35 వసంతాల వేడుక మరియు స్నాతకోత్సవ నివేదిక

ప్రభువైన క్రీస్తు నామములో దేవుని ప్రియులందరికి వందనములు. **'మరనాత వేద పాఠశాల'** అనే పేరుతో 35 సంవత్సరాలకు ముందు ఒక తారురేకుల షెడ్‌లో 10 మంది విద్యార్థులతో ఆరంభించబడి, నేడు **'మరనాత బిబ్లికల్ సెమినరీ'** అనే నూతన నామముతో, నూతన రూపమును ధరించుకొని మనముందుకు రావడం ఎంతో దీవెనదాయకం. **దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారికి** దేవుడిచ్చిన దర్శనమును మరొకమారు జ్ఞాపకం చేసుకొన్నట్లయితే వాడవాడలా, పల్లెపల్లెలలో, మన తెలుగునాట అంతటా సువార్తను చాటాలన్నదే ధ్యేయం. వారితరువాత 'మరనాత బిబ్లికల్ సెమినరీ'కి డైరెక్టర్‌గా ఉన్న **శ్రీ అల్లూరి విశ్వప్రసాద్ గారు** ఆ దర్శనమునే కొనసాగిస్తూ, డిప్లమో స్థాయిలో ఉన్న వేద పాఠశాలను బ్యాచ్‌లర్ స్థాయికి తీసుకొనివెళ్ళి దానిని నేడు సెమినరీ గా ముందుకు నడిపించడం ఎంతో దీవెనదాయకం. ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులు సేవకులుగా గొప్ప దర్శనాన్ని పొందుకొని ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో ఆశీర్వాదకరమైన పరిచర్యను కొనసాగిస్తున్నారు.

2019వ సంవత్సరానికి **'మరనాత బిబ్లికల్ సెమినరీ'** 35 వసంతాలను పూర్తిచేసుకొని, 33వ స్నాతకోత్సవమునకు తనను తాను సిద్ధంచేసుకొని, జూన్ 20వ తేదీన, ఉదయం 11 గంటలకు 50 మంది విద్యార్థులు వివిధ కోర్సులు సంపూర్తి చేసుకొని దైవసేవకుల ఆశీస్సులకు తరలిరాగా, ఆ సంతోష సమయము పూర్వ విద్యార్థులందరితోకలిసి ప్రార్థనా పూర్వకంగా ఆరంభించబడినది.

**'మరనాత బిబ్లికల్ సెమినరీ', విజయవాడ డైరెక్టర్‌గారైన శ్రీ అల్లూరి విశ్వప్రసాద్ గారు** ఈ కార్యక్రమమును ప్రారంభించగా, పూర్వ విద్యార్థులుగా ఉన్న సేవకులైన కోటిబాబు గారు, రాజేష్ గారు మరియు గొట్టిపాటి యేసుదాసు గారు, సోదరులు మౌళి మరియు దైవజనులు శ్రీ అల్లూరి విశ్వప్రసాద్ గారు పాడిన పాటలు ఎంతో దీవెనను తీసుకొనివచ్చాయి. వారు పాటలు పాడుతూఉండగా స్నాతకోత్సవానికి సిద్ధపడిన విద్యార్థులతో డైరెక్టర్ మరియు ఉపాధ్యాయ బృందము యొక్క రాక ఈ కార్యక్రమానికి ఎంతో దీవెనను తీసుకొనివచ్చింది.

వేద పాఠశాల ఆరంభ సంవత్సరంలో విద్యనభ్యసించిన మరనాత బిబ్లికల్ సెమినరీ డైరెక్టరుగా ఉన్న శ్రీ అల్లూరి విశ్వప్రసాద్ గారు తమ తల్లి మరణించినప్పుడు మరి ఎన్నడూ తిరిగి రాకూడదని వారు తీసుకున్న నిర్ణయాన్ని మార్చి దేవుడు వారిని వేద విద్యకు నడిపించి, ఒక విద్యార్థి స్థాయి నుండి డైరెక్టర్ స్థాయికి తీసుకొనివచ్చిన విధమును వివరించినప్పుడు అది ఎంతోమంది సేవకులకు స్ఫూర్తినిచ్చింది.

ఆ తదుపరి **'మరనాత బిబ్లికల్ సెమినరీ'లో డీన్ ఆఫ్ అకడమిక్స్ శ్రీ అన్నే శ్రీధర్ గారు** మాట్లాడుతూ విద్యలో విద్యార్థులను మరింత ముందుకు తీసుకొని వెళ్ళగోరి, సైకాలజీ, కౌన్సిలింగ్,

కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలైన సబ్జెక్ట్స్‌ద్వారా వారు ప్రోత్సహించబడిన విధానమును తెలియజేసిరి. **డీన్ ఆఫ్ స్టూడెంట్ శ్రీమతి దేవినేని నిర్మల గారు** మాట్లాడుతూ ఒక వ్యక్తి చేత సామాన్యంగా ఆరంభించబడిన వేద పాఠశాల పరిచర్య, సెమినరీ స్థాయికి చేరుకొని అనేకులను దేశము కొరకు అందించుటలో ముందంజ వేసిందంటే దానికి ప్రథమ కారణం దైవదాసులు శ్రీ చౌదరి గారు మరియు శ్రీ ఎ. విశ్వప్రసాద్ గారు కలిగియున్న దర్శనం. అటువంటి దర్శనంతో ప్రతి సేవకుడు ముందుకు కదులుతూ ఉంటే మన రాష్ట్రాల్ని, దేశాన్ని ప్రభువు కొరకు సంపాదించగలమనిరి.

విదేశాల నుండి ఆహ్వానించగావచ్చిన అతిథులు **రెవ. జెరహరఫిన్ గారు** 'ఏది ఏమైనా, పరిస్థితులు మారినా పరిచర్య జరిగించాలని, సాకులు చెప్పకుండా దేవుడు నాకు అప్పగించిన పని అనియు, విజయం మనలను వరిస్తుందని, సామర్ధ్యంతో ప్రభువు పనిచేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. 'గిలాదు కొండనెక్కినంతమాత్రాన సేవ జరగదని గిద్యోను జీవితం నుండి మాట్లాడుతూ, సేవ పద్ధతులను తెలుసుకోవాలని, దేవుడు మనలో ఏస్థాయిలో ఉన్నారనే సంగతి సింహావలోకనం చేసుకోవాలని, దేవుడిచ్చిన స్థితినిబట్టి ఆనందిస్తూ సేవచెయ్యాలని 2 కొరింథి 4 : 7-11లో నుండి విద్యార్థులకు హెచ్చరికలు చేశారు. వారి తరువాత **'మరనాత థియోలాజికల్ సెమినరీ', హైదరాబాద్ డైరెక్టర్ గారైన డా॥ నిరీక్షణ కంచర్ల గారు'** మాట్లాడుతూ యవ్వనస్తులైనవారు వారి బలమును దేవునికొరకు ఉపయోగించాలని, సమ్సోనును ఉదాహరణగా తీసుకొని, దేవుడిచ్చిన బలమును, అభిషేకమును తెలివితక్కువ తనంతో ఉపయోగించకుండా ఎంతో జ్ఞానయుక్తంగా జీవించాలని స్నాతకోత్సవ విద్యార్థుల నుద్దేశించి హెచ్చరిక చేశారు.

ముగింపులో **శ్రీ చౌదరి గారు** మాట్లాడుతూ, దేవుడు అప్పగించిన పరిచర్యపట్ల వారు ప్రతికూలతలలో దేవునిమీద ఆధారపడి ముందుకుసాగిన విధమును, నశించిపోతున్నవారి కొరకు ప్రార్థించే సేవకులుగా తండ్రిలా కరకుగా, తల్లిలా మృదుత్వం ప్రతి నాయకునికి తప్పనిసరి అని తెలియజేశారు. ఈమాటలు ఆలకించిన పూర్వ విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఎంతగానో దీవించబడినారు.

వారి దీవెన వచనములనంతరం, **అసోసియేట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దైవదాసురాలు ఉషారాణి గారు** పట్టా గ్రహీతలనుద్దేశించి అనేక ప్రతికూలతలను దాటుకొని వీరందరూ ఈ సమయానికి రావడమనునది దైవనిర్ణయమని, ఎంతో సంతోషంగా వారిని ఆశీర్వదించిరి. తదుపరి **రిజిస్ట్రార్‌గా ఉన్న శ్రీ క్లైవ్ బాబు గారు'** స్నాతక విద్యార్థులకు పట్టాలను దైవజనుల చేతులమీదుగా బహుకరించిరి. చివరిగా దైవజనుల ప్రార్థనతో అందరూ ఆశీర్వదించబడిరి. 'మరనాత బిబ్లికల్ సెమినరీ'లో ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పరిచర్య చేస్తున్నవారిలో అనేకులు ఒకప్పుడు మరనాత వేద పాఠశాల విద్యార్థులే కావడం మరీ విశేషం, ఆశీర్వాదకరం.

**( మిగతా 26 వ పేజీలో... )**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

**( 11 వ భాగము )**

రెవ. అల్లూరి. విశ్వప్రసాద్, విజయవాడ

## స్వభావములో మార్పు : (ఎఫెసీ 4 : 25-32)

**పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమలో వందనములు శుభములు !**

ఎఫెసీ పత్రిక 4 : 1-6 వరకు **ఐక్యతతో ఉండాలని**, 7-16 వచనములలో వైవిధ్యమైన కొన్ని సంగతులు అనగా **పరదైసును గురించి, పరిచర్యవరాలను గురించి**, 17-24 వచనము లలో **సత్యమును అనుసరించి నడుచుకోవాలని** గత మాసములలో ధ్యానంచేసాం.

ఈ సందేశములో 4వ అధ్యాయము 25-32 వచనములు వరకు **క్రీస్తు సంఘము రూపాంతరపు లేక మార్పుచెందిన అనుభవములోనికి నడిపించబడాలని** ప్రస్తావించాడు. శరీరానికి ఆరోగ్యం ఎంత అవసరమైయున్నదో సంఘానికి కూడ ఆరోగ్యము అంతే అవసరమని, సంఘము క్షేమాభివృద్ధి కలిగిఉండుటకు క్రైస్తవులు విసర్జించవలసిన **ఐదు ప్రాముఖ్యమైన విషయాలు** అపొస్తలుడైన పౌలు ఈభాగములో ఎంతో స్పష్టంగా తెలియచేస్తున్నాడు. అవేమంటే- **1) అబద్ధమాడుట మాని సత్యమే మాటలాడవలెను. 2) కోపపడుడి కాని పాపము చేయకుడి. 3) కష్టపడి పనిచేయాలి, దొంగిలించకూడదు. 4) అనుకూలమైన వచనములే పలకాలి. 5) పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు.** మన జీవితాలలో ఉన్న ఈవిధమైన బలహీనతలు పాపముతో సమానమని, వాటిని విసర్జించాలని పౌలు చెబుతున్నాడు.

**1. అబద్ధమాడుట మాని సత్యమే మాటలాడవలెను :-** **"మనము ఒకరి కొకరము అవయవములై యున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను" (ఎఫెసీ 4 : 25).** అబద్ధమాడుట మంచిదికాదు, వినినదానిని అర్థంచేసుకోవాలి. యదార్థమైన సంగతిని మాట్లాడాలి. మనందరము క్రీస్తు శరీర అవయవములై యున్నాము, ఐక్యతతో ఉన్నాము గనుక ఒకరికొకరము మనము దేవుని సహాయమును కోరుకొంటూఉండాలి. అబద్ధమాడుటవలన ఎదుటివారికి మనకు మధ్యలో ఒక అడ్డుగోడను నిర్మించుకొంటున్నాము. మనము ఆశీర్వదించబడిన ఆత్మీయ కుటుంబము. దేవునితో ఉన్న మన ఐక్యత ఇతరులతోకూడ కలిగిఉండాలి.

ఏదోఒక దానిమీద పెట్టి అబద్దాలు చెప్పడము, తెలిసికూడ తెలియదన్నట్లుగా అబద్ధమాడుట అలవాటుగా మారిపోయింది. దీనికంతటికి మనుష్యుడు కారణముకాదని దేవుని లేఖనాలు తెలియజేస్తున్నాయి. **"మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమేలేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు" (యోహాను 8 : 44).** అపవాది ఈ విధంగా చాలామందిని అబద్ధమాడడానికి ప్రేరేపిస్తున్నాడు. ఎన్నో కుయుక్తులు అపవాది దగ్గరున్నాయి. దేవుడే అబద్ధమాడుతాడు నేను అబద్ధమాడను

అనిదేవునిమీద అబద్ధాన్ని మోపి, నిరూపించాలని చూస్తాడు. ఈ వాక్యభాగము పరిశీలించడి - **"దేవుడైన యెహోవా చేసిన సమస్త భూజంతువులలో సర్పము యుక్తిగలదై యుండెను. అది ఆ స్త్రీతో ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేని ఫలముల నైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా? అని అడిగెను"** (ఆదికాండం 3 : 1). అపవాది ఆ స్త్రీతో ఇది నిజమా? అని సందేహాన్ని కలిగించాడు. అంటే అది నిజంకాదు, అబద్ధము అన్నట్లు చెబుతున్నాడు. ఆ వృక్షఫలములు తింటే నువ్వు చనిపోతావు అని దేవుడు మనుష్యునితో చెబితే, అపవాది హవ్వతో - మీరు చనిపోతారని దేవుడు చెప్పింది అబద్ధం, నువ్వు చావనే చావవు అని దేవుడు చెప్పిన ఒక నిజాన్ని అబద్ధంగా మార్చేసాడు. మీ జీవితంలో ఒక్కటి గుర్తుపెట్టుకోండి - మనము సత్యము మాట్లాడునప్పుడు దేవుడు మనతో కలసి పనిచేస్తాడు. అబద్ధమాడుతున్నప్పుడు సైతాను పనిచేస్తాడు, నిన్ను తనవైపు త్రిప్పుకుంటాడు. అబద్ధమున్నచోట దేవుని ఆత్మ ఉండదు.

**"మీరు సత్యమెరుగనివారైనందున నేను వ్రాయలేదు గాని, మీరు దానిని ఎరిగి యున్నందునను, ఏ అబద్ధమును సత్యసంబంధమైనది కాదని యెరిగి యున్నందునను మీకు వ్రాయుచున్నాను" (1యోహాను 2 : 21).** అపవాది అబద్ధికులను పోగుచేస్తున్నాడు. దేవుని యొక్క సత్యమును అసత్యముగా మార్చివేయుటకు ప్రయత్నము చేస్తున్నాడు. **"కుక్కలును, మాంత్రికులును, వ్యభిచారులును, నరహంతకులును, విగ్రహారాధకులును, అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపటనుందురు"(ప్రకటన 22 : 15).** అబద్ధమును అసహ్యించుకొనే వారేకాదు, అబద్ధమును ప్రేమించేవారున్నారు. మానవుడు స్వలాభాపేక్ష, ఈలోక సంబంధమైన వాటికోసం అబద్ధమాడుతున్నాడు. మనం అబద్ధము యొక్క స్వాధీనంలో ఉండకూడదు, సత్యము యొక్క స్వాధీనములో ఉండాలి. **"ప్రేమకలిగి సత్యము చెప్పచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము" (ఎఫెసి 4 : 15).**

అపోస్తలుడైన పేతురు సేవ ఆరంభించినప్పుడు పరిశుద్ధాత్మశక్తితో నిండుకొని ఉన్నాడు. ఆ కాలములో అననీయ, సప్పీరా అను దంపతులు ఉండేవారు. ఆ దినాలలో ఆది క్రైస్తవసంఘ విశ్వాసులు ఏదైన అమ్మినా, కొన్నా ప్రతిదీ తీసుకొనివచ్చి అపొస్తలుల పాదాలదగ్గర పెట్టేవారు. దేవునికి ఇచ్చే విషయములో వారు ఆవిధంగా చేసేవారు. దేవుని సన్నిధిలో మన అర్పణలు, దశమభాగములు అర్పించడము, మనకొచ్చిన లాభములో గాని, ఆస్తిలోగాని దేవునికి ఒక భాగాన్నివ్వడములో గొప్ప ఆశీర్వాదముంది. అననీయ సప్పీరాలు ఏకమై వారి పొలమును అమ్మేసారు. అమ్మిన తరువాత ఆ సొమ్మునంతా అపొస్తలుల పాదాలదగ్గర పెట్టవలసిఉండగా కొంత సొమ్మును వారు తీసుకురాలేదు. అననీయ అనే పేరుకు దేవుడు కృపకలిగినవాడు అని, సప్పీరా అనే పేరుకు సౌందర్యము అని అర్థం. మంచిపేర్లు వారికి ఉన్నాయి. కాని వారు అపవాదికి చోటిచ్చి దేవునికి విరుద్ధమైన అబద్ధమాడినందువలన ప్రాణాలు పోగొట్టుకొన్నారు. మొదటగా అననీయ పొలము అమ్మిన సొమ్మును కొంతతెచ్చి అపొస్తలుల పాదాలయొద్ద పెట్టాడు. "అప్పుడు పేతురు - అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని **పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను.** అది నీయొద్ద నున్నప్పుడు అది నీదేకదా? అమ్మినపిమ్మట

అది నీవశమై యుండలేదా? ఎందుకు ఈసంగతి నీహృదయములో ఉద్దేశించుకొన్నావు? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను"(అపో॥ కా॥ 5 : 3,4). దేవుని సన్నిధికి నమ్మకముగా వస్తున్నవారు, దేవుని ఆరాధిస్తున్నవారు, దేవునికొరకు జీవించిన వారు, అపొస్తలుల సేవలో సహకరిస్తున్నవారు ఎన్నోసార్లు అర్పణను తీసుకువచ్చి అపొస్తలుల పాదాలచెంత పెట్టినవారిని అపవాది ప్రేరేపించగా అపవాది ప్రేరేపణకు అవకాశం ఇచ్చారు. అననీయ ఈ మాటలు వినుచునే పడి ప్రాణము విడువగా వినినవారికందరికిని మిగుల భయము కలిగెను; అప్పుడు పడుచువారు లేచి వానిని బట్టతో చుట్టి మోసికొనిపోయి పాతిపెట్టిరి. అబద్ధానికి తీర్పు జరిగిపోయింది!

ఈరోజు విశ్వాసులు లోపల దేవునికి అయిష్టమైన పాపమును కలిగిఉంటే అట్టివాటిని దేవుని సన్నిధిలో ఒప్పుకోవాలి. ఒప్పుకొంటే దేవుని ఆశీర్వాదాన్ని పొందుకుంటాం. దాదాపుగా మూడు గంటలు గడిచిపోయిన తరువాత అననీయ భార్య జరిగినది యెరుగక లోపలికి వచ్చెను. అప్పుడు పేతురు - మీరు ఆ భూమిని ఇంతకే అమ్మితిరా నాతో చెప్పుమని ఆమెను అడిగెను. అందుకామె - అవును, ఇంతకే అని చెప్పెను. అందుకు పేతురు - ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి? ఇదిగో నీ పెనిమిటిని పాతిపెట్టినవారి పాదములు వాకిటనే యున్నవి; వారు నిన్నును మోసికొని పోవుదురని ఆమెతో చెప్పెను. వెంటనే ఆమె అతని పాదములయొద్ద పడి ప్రాణము విడిచెను(అపో॥ కా॥ 2 : 7-10). అబద్ధమాడినందుకు దుష్ఫలితాన్ని వారు అనుభవించారు.

పొలము అమ్మిన సొమ్ములో కొంత మేము దాచుకున్నాము, క్షమించండి అని అననీయ, సప్పీరా వారే నిజము ఒప్పుకొనిఉంటె బ్రతికిఉండేవారు. ఐతే దాని ఫలితం ఎంతోకొంత అనుభవించేవారు, కాని చనిపోయేవారు కాదు. అబద్ధమాడుట వలన అనేక వ్యక్తులు దుష్ఫలితాలను అనుభవించుట బైబిల్ గ్రంథములో కనబడుతుంది. దేవునికి వ్యతిరేకంగా మనం చేసినదాన్ని దేవుని యొద్ద ఒప్పుకోవాలి. దేవుడు తప్పకుండా ఆ విషయములో విడుదల కలిగించి తన మహిమకొరకు మనలను వాడుకొంటాడు. అపవాది మనలోపలనుండి మనలను ప్రేరేపిస్తాడు, విశ్వాసాన్ని పోగొడతాడు, సత్యములో నుండి అసత్యములోనికి తీసుకువెళతాడు. అపవాది అబద్ధికుడు మరియు హంతకుడు. అపవాది అననీయ, సప్పీరాలను అబద్ధములో పడవేయడమే కాకుండా వారిని మరణంపాలు చేసాడు. కాబట్టి మీలోఉన్న అబద్ధమనే అపవాది సంబంధమైన లక్షణాన్ని దేవుని సన్నిధిలో ఒప్పుకోండి. పరిశుద్ధతలో మనం నడవాలంటే మనలో సత్యము ఉండాలి.

**2. కోపపడుడి గాని పాపము చేయకుడి:- "కోపపడుడి గాని పాపము చేయకుడి; సూర్యుడస్తమించువరకు మీ కోపము నిలిచియుండకూడదు. అపవాదికి చోటియ్యకుడి"(ఎఫెసీ 4:26, 27).** కోపములో పరిశుద్ధతతో కూడిన కోపముంది, పాపముతో కూడిన కోపముంది. మన కోపము ఎప్పుడూ పరిశుద్ధమైనదై ఉండాలి. "హోరేబులో మీరు యెహోవాకు కోపము పుట్టించినప్పుడు యెహోవా మిమ్ము నశింపజేయునంత కోపము మీమీద తెచ్చుకొనెను" (ద్వితి. 9 : 8). దేవుని కోపము పవిత్రమైనది. దేవుని కోపము మనలను సరిచేస్తుంది, సరిచేయుటకు దేవునికోపము మనకు నష్టాన్ని కూడ కలుగచేస్తుంది. దేవుని కోపము

తీర్పుతీర్చేది. పాపానికి వ్యతిరేకమైన కోపమది. **“గోనెపట్ట కట్టుకొనుడి; రోదనము చేయుడి. కేకలు వేయుడి, యెహోవా కోపాగ్ని మనమీదికి రాకుడా మానిపోలేదు” (యిర్మియా 4 : 8).** దేవుడు ప్రతిది స్పష్టంగా, సంపూర్ణముగా చూచేవాడు. దేవుని కనుదృష్టి నుంచి మనము తప్పించుకోలేము. మనకు తెలియనివి అన్నీ ఆయనకు తెలుసు. నేను నా దేవునికి తెలుసు. నా దేవుడు నన్ను చూస్తున్నాడు. అనేసంగతిని ఎప్పుడూ మనము గుర్తుపెట్టుకోవాలి. కోపపడుడి గాని అది మనసులో పెట్టుకొని పాపము చేయకుడి, సూర్యుడస్తమించేలోపు వారితో సమాధానపడండి అని దేవునివాక్యం సెలవిస్తోంది. కోపతాపాలు మానవసహజం. వాటిని మనం గుర్తించి వెంటనే సరిచేసుకొందాం, తీసివేసుకొందాం.

**“నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము; లేనియెడల ఒకవేళ నీ ప్రతివాది నిన్ను న్యాయాధిపతికి అప్పగించును. న్యాయాధిపతి నిన్ను బంట్రౌతులకు అప్పగించును. అంతట నీవు చెరసాలలో వేయబడుదువు” (మత్తయి 5 : 25).** అబద్ధాలాడటం, కోపపడటం ద్వారా మనంచేసే తప్పిదాలన్నిటితోను అపవాదికి సంతోషాన్ని కలిగిస్తున్నాం. **“మృదువైన మాట క్రోధమును చల్లార్చును. నొప్పించుమాట కోపమును రేపును”(సామెతలు 15 : 1).** మీరు కోపపడవలసిన సమయములోనే కోపపడాలి, కోపపడవలసిన ఉద్దేశ్యములోనే కోపపడాలి, ఆ పరిధిలోనే కోపపడాలి, కోపపడవలసిన వ్యక్తిమీదే కోపపడాలి, కోపపడవలసిన సందర్భములోనే కోపపడాలి. మీరు కోపపడిన వారికి అది న్యాయమైనదిగా అనిపించాలి.

**3. కష్టపడి పనిచేయాలి, దొంగిలించకూడదు:-** **“దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను” (ఎపెసీ 4 : 28).** దేవుడు ఇచ్చిన ఆజ్ఞలలో ప్రాముఖ్యమైనది **‘దొంగిలకూడదు’.** ఈ ఆజ్ఞను ఖచ్చితంగా ప్రతిఒక్కరు పాటించాలి. **దొంగ దొంగతనమును, హత్యను, నాశనమును చేయుటకు వచ్చునుగాని మరిదేనికిని రాడు (యోహాను 10 : 10).** కష్టించి పనిచేయండి, సంపాదించండి, దొంగతనం చేయవద్దు. సోమరి క్రైస్తవులు దేవునికివ్వవలసిన అర్పణలు, దశమభాగములు ఇవ్వకుండా దేవునిసొమ్ము దొంగిలుతున్నారు. తమ్మును తాము మోసంచేసుకొంటున్నారు, దేవునిని మోసంచేస్తున్నారు, ఇతరులను కూడ మోసం చేస్తున్నారు. దేవునికి ఇస్తే మీకు ఆశీర్వాదం వస్తుది, లేకుంటే ఆశీర్వాదం పోతుంది. మన పిల్లలకు కష్టపడి చదువుకోవడం, పనిచెయ్యడం, దేవునికి అర్పణలు చెల్లించడం వంటి మంచి అలవాట్లను నేర్పిద్దాం. బైబిల్ గ్రంథములో కొంతమంది కష్టపడి పనిచేస్తూ దేవుని సేవ చేశారు. మోషే గొఱ్ఱెలకాపరి, గిద్యోను పనిచేశాడు, దావీదు తండ్రియొక్క గొఱ్ఱెల మందలను మేపాడు. యేసుక్రీస్తుయొక్క నలుగురు శిష్యులు చేపలు పట్టే జాలరులు. యేసుక్రీస్తు 30 సంవత్సరాలు వడ్రంగిపని చేసాడు. ప్రతిఒక్కరము కష్టపడి పనిచెయ్యాలి.

**4. అనుకూల వచనములే పలకాలి:-** **“వినువారికి మేలు కలుగునట్లు అవసరతనుబట్టి క్షేమాభివృద్ధి కరమైన అనుకూల వచనమే పలుకుడిగాని దుర్భాష ఏదైనను మీనోట రానియ్యకుడి” (ఎఫెసీ 4 : 29).** మన హృదయము, నోరు రెండూ అనుకూలముగా స్పందించాలి. హృదయము నిండియున్న దానినిబట్టి నోరు మాటలాడును. తోటి మనిషిని

బూతులు మాట్లాడటం, శపించే మనసు కలిగిఉండకూడదు. "వారి నోటినిండ శపించుటయు పగయు ఉన్నవి" (రోమా 3 : 14). పౌలుభక్తుడు ఒకప్పుడు హింసకుడు, దూషకుడు, హానికరుడు. స్త్రీలని, పురుషులని తేడా లేకుండా క్రైస్తవ సంఘమును అపరిమితంగా హింసించేవాడు. పౌలు జీవితం దైవ దర్శనముతో మారిపోయింది. దూషించే పౌలు ప్రార్థించే పౌలుగా మార్పు చెందాడు. ఈరోజుల్లో క్రైస్తవ సంఘాలను, విశ్వాసులను దూషించేవారు, ఆటంకపరచేవారిని దేవుడు సౌలును దర్శించినట్లు దర్శించును గాక. హృదయమందు యేసుక్రీస్తు ప్రభువని విశ్వసించి నోటితో ఒప్పుకొనినప్పుడు రక్షింపబడ్డాము. ఆ నోటినుండి బూతుమాటలు, అబద్ధములు, దుర్భాషలు రానియ్యకండి. **"ఇప్పుడైతే మీరు కోపము, ఆగ్రహాము, దుష్టత్వము, దూషణ, మీనోట బూతులు అను వీటినన్నిటిని విసర్జించుడి" (కొలస్సి 3 : 8).** హృదయములో మార్పులేకుండా నోరు మారదు. ఒకవ్యక్తి నోటితో దుర్భాషలాడుతున్నాడంటే అతని హృదయములో మార్పులేదు. ఈ వాక్యపు వెలుగులో మన భాష, మనతీరు ఎలాఉందో మనం ఒకింత పరిశీలనచేసుకొందాం. "వారి గొంతుక తెరచిన సమాధి, తమ నాలుకతో మోసము చేయుదురు; వారి పెదవులక్రింద సర్ప విషమున్నది. వారి నోటినిండ శపించుటయు పగయు ఉన్నవి"(రోమా 3 : 13). సర్పము కరిస్తే మనుష్యులు ఎలాగు చనిపోతారో కొంతమంది మాటలు ఆవిధంగా చంపేస్తాయి. ఎవ్వరు ఇతరులకు అటువంటి కష్టాన్ని నష్టాన్ని కలిగించేవారుగా ఉండవద్దని మనవిచేస్తున్నాను.

**"ప్రతి మనుష్యునికి ఎలాగు ప్రత్యుత్తరమీయవలెనో అది మీరు తెలుసుకొనుటకై మీ సంభాషణ ఉప్పు వేసినట్లు ఎల్లప్పుడు రుచిగలదిగాను కృపాసహితముగాను ఉండనియ్యుడి" (కొలస్సీ 4 : 6).**

**5. పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు:- "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచనదినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు. సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి." (ఎఫెసీ 4 : 30-32).** ద్వేషము చాలా ప్రమాదకరమైనది. అది ఉగ్రతలోనికి నడిపిస్తుంది. ద్వేషము హృదయములో పుట్టి, మొదట పిడికిలిలో ఆరంభమవుతుంది తరువాత లోపలున్న ద్వేషము రగులుకొని పెదాలలో నుంచి పదాలు బయటకు వచ్చేస్తాయి. మీరు అలా ఉండవద్దని పౌలు ఇక్కడ చెబుతున్నాడు. **"సహోదరులు ఐక్యత కలిగిఉండుట ఎంత మేలు! ఎంత మనోహరము!" (కీర్తన 133 : 1).** కోపము, ద్వేషము మనుష్యులను వేరుచేస్తుంది. కాని, దేవునిసన్నిధి, దేవునిప్రేమ మనిషిని దగ్గరచేస్తాయి. ద్వేషం, కోపం, దొంగతనం, అబద్దాలు, అల్లరి, దూషణ ఇవన్నీ అపవాది సంబంధమైనవి. ఇవి మనలో ఉంటే అవి పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తాయి, మరియు మనకోసం ప్రాణంపెట్టి, మనలను రక్షించి, విమోచించి రక్షణభాగ్యమునిచ్చిన యేసుక్రీస్తును కూడ దుఃఖపరుస్తుంది. యేసుక్రీస్తును మనము అంగీకరించినప్పుడు, తండ్రి మనలను ప్రేమించి తన కుమారునిగా, కుమార్తెగా స్వీకరించినప్పుడు ఈ సకలమైన దుష్టత్వము మనలో ఉన్నట్లయితే అవి దేవుని నామమునకు మహిమను తీసుకొనిరావు, అవమానమును తీసుకొని వస్తాయి. అందువల్ల - **"ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమిచినప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4 : 32).** ఇట్టి దైవికమైన స్వభావముతో దేవుడు మనలను నడిపించునుగాక! **- మరనాత.**

## (16వ పేజీ తరువాయి.. 'మరనాత థియెలాజికల్ సెమినరీ - నివేదిక')

వాక్య పరిచర్య అనంతరం శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు పట్టభద్రులకు సర్టిఫికెట్లు మరియు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ సంవత్సరం దేవుని కృపనుబట్టి మరనాత థియెలాజికల్ సెమినరి భారభరితమైన కృషి ద్వారా 30 మందిని (**Dip.Th., B.Th., IBC** కోర్సులు చేసినవారిని) పట్టభద్రులను చేయడానికి దేవుడు సహాయం చేశాడని తెలపడాన్నిబట్టి సంతోషిస్తున్నాము.

స్నాతకోత్సవ ఆఖరి ఘట్టములో డా॥ నిరీక్షణ కంచర్ల గారు వచ్చిన అతిధులకు, సహకరించిన స్థానిక మరనాత విశ్వాస సమాజ సభ్యులకు వందన సమర్పణచేశారు. అనంతరం శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు పట్టభద్రుల కొరకు ప్రార్థించి సువార్తకు వారిని ప్రతిష్ఠించి ఆశీర్వాదముతో స్నాతకోత్సవమును ముగించిరి. ఈ పరిచర్య కొరకు పాఠకులందరు ప్రార్థించ మనవి. **- మరనాత థియెలాకల్ సెమినరీ ఆచార్యులు**

---

## (18 వ పేజీ తరువాయి... 'నూతన శక్తి' )

తనను తరుముతూ ఉన్న సౌలు తనచేతికి దొరికినా చంపక విడిచిపెట్టడంలోనే స్పష్టమౌతుంది. ఒకవేళ అసహనం, దేవునిమీద అసంతృప్తి ఉన్నట్లయితే మారణకాండకు దారితీయటమేకాక దావీదు నరహంతకునిగా మారిపోయేవాడు. కాని సహనంతో కనిపెట్టటం వలన ఇశ్రాయేలీయుల రాజ్యవ్యాప్తికి తోడ్పడటమేకాక, దేవుని నుండి నిత్యమైన వాగ్ధానం పొందుకున్నాడు (కీర్తన 37 : 9, 34).

అందుకే దేవునిమీద నమ్మకముంచుతూ, మన మార్గములను సంపూర్ణంగా ఆయనకు అప్పగించి, సహనముతో సాగుతూ దేవుడు అనుగ్రహించే నూతన బలమును పొందుకుని మన జీవితాలద్వారా దేవునిని మహిమపరుద్దాం. **- మరనాత.**

---

## ( 20 వ పేజీ తరువాయి... 'మరనాత బిబ్లికల్ సెమినరీ - నివేదిక' )

భోజనానంతరం మరల పూర్వ విద్యార్థులందరూ సమావేశమై, బిబ్లికల్ సెమినరీలో తమ బాధ్యతలను గురించి మాట్లాడగా ఒక్కొక్కరు ఒక్కోరీతిగా వారి సలహాలను అందించిరి. జిల్లాలవారీగా బాధ్యులుగా ఉన్నవారు వారి జిల్లాలలో ఎవరైతే ఉన్నారో వారిద్వారా ఈ పూర్వవిద్యార్థుల సమావేశాలను నిర్వహించి, పరిచర్యలో వారిని బహుగా బలపరచి, వారి ప్రాంతాలలో ఉన్న యవ్వనస్థులను ప్రభువు పరిచర్య కొరకు సిద్ధంచేయాలనే తీర్మానంతో ఆరోజు సమావేశమును ముగించడం జరిగింది. ఈవిధముగా పూర్వ విద్యార్థుల సమావేశమును, గ్రాడ్యుయేషన్‌ను సెమినరీ ప్రాంగణంలో నిర్వర్తించడం ప్రథమం. ఇటువంటి సమావేశములు అనేకములు జరగాలని ఇంకా అనేకులు ఈ ప్రాంగణంలో కాలిడి, ప్రభువు కొరకు తమను తాము సిద్ధం చేసుకోవాలని ప్రార్థిద్దాం.

**మరనాత బిబ్లికల్ సెమినరీ ఉపాధ్యాయ బృందం**

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Gollapudi, VIJAYAWADA - 521 225
Printed on 08-10-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

## ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,
దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు
ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary tv

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు
శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు
శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు
శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు




-: ప్రతుల కొరకు : -

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118




R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-06-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల – విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

"దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం"



దైవజనులు
శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

జన్మ, కర్మ పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.



**నిర్వహించే కోర్సులు :**

1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం॥లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం॥లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9- మే నెల 19 వరకు)

అర్హతలు : రక్షణానుభవము, సేవార్హమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం॥లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందదాసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ. 100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశీ, విదేశీ సేవానుభవం కలిగిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక సత్క్రియల సమన్వయము.

**వివరములకు :**



రెవ. శిలిపురపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, టి అండ్ టి కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com


మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
కంప్యూటర్, సంగీతము, ప్రత్యేకమైన లైబ్రరి తరగతులు.
విశిష్టతలు
స్థానిక సంఘంలో, చాపెల్ సర్వీస్‌లో దేవునితో అద్భుతమైన ఆరాధన అనుభూతి.
Spoken English Courses
ATA Curriculum
మరనాత విశ్వాస సమాజము
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199